# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 79 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శనివారం10 మే 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 79 10-05-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-




**సరిహద్దుల్లో ఉద్రిక్తతలు..** 2 లో..

**గుజరాత్ సీఎంకు మోదీ ఫోన్**

## జాతీయ భద్రతపై రాజ్‌నాథ్ సింగ్ సమీక్ష



**న్యూఢిల్లీ మే 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

త్రివిధ దళాలు, ఉమ్మడి రక్షణ సేవలు (సిడిఎస్) ఉన్నతాధికారులతో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం సమావేశమయ్యారు. జాతీయ భద్రతపై సమీక్ష నిర్వహించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. భద్రతా పరిస్థితికి సంబంధించిన ప్రతి అంశాన్ని ఈ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. రక్షణ కార్యకలాపాలు, భద్రతాదళాల కదలికలకు సంబంధించి ప్రత్యక్ష ప్రసారాలను నిలిపివేయాలని రక్షణ శాఖ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను ఆదేశించింది. కార్గిల్ యుద్ధం, 26/11 ముంబయి దాడులు, కాందహార్ హైజాక్ వంటి గత సంఘటనలను ఉదహరిస్తూ.. సున్నితమైన సమాచారాన్ని బహిర్గతం చేయడం వలన రక్షణ కార్యకలాపాలకు ఆటంకం కలుగుతుందని పేర్కొంది. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, వైమానిక చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠి, రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్‌లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పశ్చిమ సరిహద్దులో భద్రతా పరిస్థితి మరియు భారత సాయుధ దళాల కార్యాచరణ సంసిద్ధతను రాజ్‌నాథ్‌సింగ్ సమీక్షించినట్లు రక్షణ శాఖ ప్రతినిధి తెలిపారు. రక్షణ మంత్రిత్వ శాఖ భారత్ తన సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి మరియు తన ప్రజల భద్రతను నిర్ధారించడానికి పూర్తిగా సిద్ధంగా ఉందని తెలిపింది. భారత సైనిక స్థావరాలపై పాకిస్తాన్ దాడులను తిప్పికొట్టిన మరుసటి రోజు ఈ సమావేశం జరిగింది. జమ్ము, పఠాన్‌కోట్, ఉధంపూర్‌లతో పాటు పలు ప్రాంతాల్లోని సైనిక స్థావరాలు లక్ష్యంగా గురువారం రాత్రి పాక్ చేపట్టిన డ్రోన్‌లు, క్షిపణుల దాడిని భారత సైన్యం తిప్పి కొట్టిన సంగతి తెలిసిందే.





## యుద్ధభూమిలో ఏపీ జవాన్
# వీరమరణం..



- జమ్ముకశ్మీర్‌లో పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో తెలుగు జవాన్ మురళీ నాయక్ మృతి
- జవీర జవాన్‌ది ఏపీలోని సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లి తండా
- శనివారం స్వగ్రామానికి వీర జవాన్ పార్థివ దేహం

**అనంతపురం మే 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌ను సహించలేని దాయాది పాకిస్థాన్ వక్రబుద్ధితో భారత సరిహద్దు ప్రాంతాలపై క్షిపణి, డ్రోన్ దాడులకు పాల్పడుతోంది. ఈ క్రమంలో జమ్ముకశ్మీర్‌లో పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో తెలుగు జవాన్ వీర మరణం పొందారు. మృతిచెందిన

- మిగతా 2 లో..

## మోడీతోనే దేశ సంరక్షణ

### అనంతపురం జిల్లా పర్యటనలో సీఎం చంద్రబాబు నాయుడు



**అనంతపురం మే 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఈ దేశాన్ని రక్షించే శక్తి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ఉందని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం చాయాపురంలో ఇవాళ ఆయన మాట్లాడుతూ దేశం మొత్తం యుద్ధ వాతావరణంలో ఉందన్నారు. టెర్రరిస్టులు దాడులతో దేశం మొత్తం చలించి పోయిందని చెప్పారు. మన దేశం టెర్రరిజానికి ఎల్లప్పుడూ వ్యతిరేకమన్నారు. పహెల్గాంలో మన వారిని ఇష్టానుసారంగా చంపేశారని ఆవేదన వ్యక్తంచేశారు. తీవ్రవాదానికి ప్రపంచంలో చోటు లేదని ప్రధాని మోడీ ఎప్పుడూ చెబుతుంటారని పేర్కొన్నారు. పాకిస్తాన్మనపైనే దాడులు చేస్తూ కవ్వింపు చర్యలు చేస్తుందని మండిపడ్డారు. దేశం కోసం ఎంతో మంది యువకులు రక్షణ రంగంలోకి వెళుతున్నారని తెలిపారు. అయితే మన తెలుగువాడు మురళీ నాయక్ ఉగ్రవాదులతో పోరాటి వీర మరణం పొందడం చాలా బాధ కలిగించిందన్నారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి, ప్రగాఢ సానుభూతి తెలియజేసినట్లు తెలిపారు. మురళీనాయక్కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. దేశ రక్షణలో సైనికులు ఉండబట్టే ఇక్కడ మనం సంతోషంగా నిద్ర పోగలగుతున్నామని



## భానుడి భగభగ...

- ప్రకాశం జిల్లాలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత
- ప్రకాశం దరిమడుగులో 42°C, తిరుపతి గంగుడుపల్లెలో 41.3°C
- రాష్ట్రంలో క్రమంగా పెరుగుతున్న ఎండ తీవ్రత
- కోనసీమ ఆత్రేయపురంలో 63.7మిమీ, చొప్పెలలో 55మిమీ వర్షపాతం
- శనివారం 3 మండలాల్లో తీవ్ర వడగాలులు, 23 మండలాల్లో వడగాలులు.
- అల్లూరి, చిత్తూరు, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో పిడుగులతో వర్షాలు.

వివరాలు 3లో..



## 'జెడ్ ప్లస్' కేటగిరీ భద్రత పునరుద్ధరించాలన్న జగన్...

### హైకోర్టులో విచారణ వాయిదా

**జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతపై ఏపీ హైకోర్టును ఆశ్రయించిన జగన్**

**తనకు ప్రాణహాని ఉందని పిటీషన్‌లో పేర్కొన్న మాజీ సీఎం**

**ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు... తదుపరి విచారణ వేసవి తర్వాతకు వాయిదా**



**తాడేపల్లి మే 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి హైకోర్టులో నిరాశ ఎదురైంది. తనకు జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతను పునరుద్ధరించాలని, ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని కోరుతూ ఆయన గురువారం ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం... తదుపరి విచారణను వేసవి తర్వాతకు వాయిదా వేసింది. తనకు ఉన్న ప్రాణహాని దృష్ట్యా సీఆర్‌పీఎఫ్ లేదా ఎన్‌ఎస్‌జీలతో సెక్యూరిటీ కల్పించాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వాన్ని జగన్ అభ్యర్థించారు. తన నివాసం, కార్యాలయం వద్ద పటిష్టమైన భద్రతతో పాటు, జామర్లు, పూర్తిస్థాయిలో పనిచేసే బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని సమకూర్చాలని కోరారు. అయితే, కేంద్రం పట్టించుకోకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తనకు తగిన భద్రత కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని కోర్టును విన్నవించారు. తనకు జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతను పునరుద్ధరించాలని కోరారు. ఈ సందర్భంగా, రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత ఎలాంటి ముందస్తు సమాచారం గానీ, నోటీసు గానీ ఇవ్వకుండా తన భద్రతను భారీగా తగ్గించేశారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు.

## కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకు వై ప్లస్ భద్రత

**న్యూఢిల్లీ మే 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ పేరుతో రంగంలోకి దిగిన విషయం తెలిసిందే. ఈ తరుణంలో పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరుతో మెరుపుదాడులు నిర్వహిస్తుంది. ప్రస్తుతం భారత్%-%పాకిస్తాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడికి కేంద్ర ప్రభుత్వం భద్రతను పెంచారు. ఇప్పటివరకు ఆయనకు ఉన్న వై కేటగిరీ భద్రతను తాజాగా వై



ప్లస్ కేటగిరీగా అభివృద్ధి చేశారు. ఈ కేటగిరీ మార్పుతో రామ్మోహన్ నాయుడికి రాష్ట్ర పోలీసుల తరపున ఇద్దరు గన్‌మెన్‌లు, అలాగే ఇద్దరు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (CRPF) కమాండోలు భద్రతను కల్పిస్తారు. తాజా పరిస్థితుల్లో రామ్మోహన్ నాయుడిని నలుగురు భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశారు. వై ప్లస్ కేటగిరీ భద్రతకు అనుగుణంగా కేంద్రం నియమించిన చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్, సీఆర్పీఎఫ్ కమాండో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడి భద్రతకు విధుల్లో చేరినట్లు సమాచారం.

జనరల్ న్యూస్
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

## సంపాదకీయం

# పూర్తిస్థాయి యుద్ధమే వస్తే...

పాకిస్తాన్ దుశ్చర్యల కారణంగా 'ఆపరేషన్ సిందూర్'ను భారత్ అనివార్యంగా చేపట్టింది. అయితే దీనికి ప్రతి చర్యగా పాకిస్తాన్ ఉత్తర, పశ్చిమ భారత్‌లలోని 15 లక్ష్యా లపై దాడికి ప్రయత్నించింది. భారత్ ఈ దాడులను దీటుగా ఎదుర్కొని పాక్ ప్రయోగించిన మిస్సైళ్లను కూల్చివేసింది. అలాగే పాక్ గగనతల రక్షణ వ్యవస్థలను భారత్ లక్ష్యంగా చేసుకోవడంతో లాహెూర్ లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ నిర్వీర్యమయ్యింది. భారత్ కేవలం ఉగ్రవాద శిబిరాలనే లక్ష్యంచేసుకుని ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టింది. కానీ పాక్... తన పౌరులపై దాడి చేసినట్లు దుష్ప్రచారం మొదలు పెట్టింది. నిజానికి పాకిస్తానే సరిహద్దు గ్రామాలపై కాల్పులు జరిపి 16 మంది భారత పౌరులను పొట్టన పెట్టుకుందని విదేశాంగ, రక్షణ మంత్రిత్వ శాఖలు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని ప్రకటించడం గమనార్హం.

పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో సహా పాకిస్తాన్‌లో ఉన్న ఉగ్రవాద శిక్షణ శిబిరాలపై భారత్ దాడి చేయడంతో ఇరుదేశాల మధ్య ఉన్న ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకున్నాయి. నియంత్రణ రేఖ వద్ద పాకిస్తాన్ విచ్చలవిడిగా కాల్పులు ప్రారంభించింది. ఈ దాడిలో అమాయకులైన సరిహద్దు గ్రామాల ప్రజలు చని పోతున్నారు, గాయపడుతున్నారు.

శ్రీనగర్, జమ్మూల లెఫ్టినెంట్ గవర్నర్లు సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇటువంటి పాకిస్తాన్ దుశ్చర్యలు దానికి మరిన్ని కష్టాలు తీసుకువస్తాయి తప్ప పరిస్థితి సద్దు మణిగే అవకాశం లేదు. ఈ దాడుల్లో జైష్ ఏ మహమ్మద్‌కు చెందిన మౌలానా మసూద్ అజార్ కుటుంబ సభ్యులు చనిపోవడంతో అతడు ఆగ్రహావేశాలతో రగిలిపోతూ మన ప్రధానికి ఒక హెచ్చరిక లేఖను పంపాడు.

అంతర్జాతీయ సమాజంలో పాకిస్తాన్ తిరిగి తన పరువును నిలబెట్టుకోవడం కోసం మూడు స్థాయి లలో భారత్‌పై దాడి చేస్తోంది. ఇవి: ఒకటి, భారత సరి హద్దు ప్రాంతాల్లో తీవ్ర చర్యలు చేపట్టడం, రెండు, భారత్‌పై ఆక్రమణ చర్యలకు పూనుకోవడం, మూడు, ప్రతీకారంతో ఉగ్రవాద కార్యకలాపాలను పెంచడం.

గతంలో ఈ ఉగ్రవాద దాడుల్ని ఎదుర్కోవడానికి మాత్రమే మనం వ్యూహాన్ని రచించేవాళ్ళం. అయితే గత కొన్ని దశాబ్దాలుగా మన వ్యూహం కూడా మారింది. రాజ్యాంగ అధికరణ 370ను రద్దు చేయడంతో కశ్మీర్‌లో 90 శాతం తీవ్రవాదం తగ్గిపోయింది. అక్కడ సాధారణ జనజీవన స్రవంతి నెలకొంది. దీనిని ఈర్ష్యతో, పగతో రగిలిపోతున్న పాకిస్తాన్ ఏమాత్రం జీర్ణించుకోలేకపోయింది. అందుకే కొత్తగా ఉగ్రదాడులకు తెరలేపింది. ఈసారి జరిగిన దాడులకు ఇజ్రాయెల్ తరహాలో భారత్ ప్రతిస్పందించింది. భారత్ తన యుద్ధతంత్రం మార్చి దౌత్యపరంగా, ఆర్థికంగా, సాంకేతికంగా, మానసికంగా, వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ అంతర్జాతీయ సమాజంలో పాక్‌ను ఒక ఉగ్రవాద దేశంగా నిరూపించడంలో కొంత విజయం సాధించగలిగింది. 53 దేశాలు భారత్‌కి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ మద్దతు తెలియజేయడం విశేషం. అమెరికా పాత్ర పాకిస్తాన్, భారత్‌ల విషయంలో గోడ మీద పిల్లిలా కనిపిస్తోంది.

**ఇదే మంచి అవకాశం**

ఈ సమయంలో పాకిస్తాన్ ఏ ఒక్క చిన్న పొర పాటు చేసినా అది పూర్తిస్థాయి యుద్ధంగా మారే అవకాశం ఉంది. ఉగ్రవాద స్థావరాలకు నెలవుగా మారిన పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్ తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ఇది ఒక సువర్ణ అవకాశం అవుతుంది. అయితే యుద్ధం తలెత్తితే చైనా కచ్చితంగా పాకిస్తాన్‌కు సహాయం చేస్తుంది. కారణం భారత్‌ను చైనా చిరకాల శత్రువుగా భావించడం. అలాగే బంగ్లా దేశ్‌ను మతం పేరుతో పాక్ దగ్గర తీసుకునే అవకాశం లేకపోలేదు.

అంటే యుద్ధం వస్తే భారత్ మూడు వైపుల నుంచి ముప్పు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నమాట. కేవలం పంజాబ్, రాజస్థాన్, కశ్మీర్, గుజరాత్ రాష్ట్రాలు మాత్రమే కాకుండా ఉత్తర, ఈశాన్య రాష్ట్రాలు కూడా ప్రమాదాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈశాన్య రాష్ట్రాలకు ముఖద్వారమైన 'చికెన్ నెక్' లేదా సిల్‌గురి కారిడార్‌పై చైనా ఎప్పటి నుంచో కన్ను వేసిన విషయం గుర్తుంచుకోవాలి.

భారత్‌పై అణ్వాయుధాలను ప్రయోగిస్తామని పాక్ పదేపదే హెచ్చరిస్తోంది. ఇదే జరిగితే భారత్‌కు ఎక్కువ నష్టం కలగకపోవచ్చు కానీ పాకిస్తాన్ 'మరుసటి రోజు సూర్యోదయం చూడదు' అనే మాట అతిశయోక్తి కాదు. మనం అణ్వాయుధాల విషయంలో 'మొదట మేం ప్రయోగించం' అని చెప్పాము గాని 'ఇతర దేశాలు ప్రయోగించినా మేం ప్రయోగించం' అని ఎప్పుడూ చెప్పలేదు.

ప్రపంచంలో నాలుగవ రక్షణ శక్తిగా ఉన్న భారతదేశం అన్ని రకాలుగానూ పాకి స్తాన్‌ను ఎదుర్కోగలుగుతుంది. పౌరులు ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో మరింత జాగ్రత్తతో వ్యవహరించి, అనుమానాస్పదమైన సంఘటనలను ప్రభుత్వ యంత్రాంగానికి ఎప్పటికప్పుడు తెలియచేయాలి. అవసరమైతే కదనరంగంలో కాలు పెట్టాలి. అప్పుడే ఉగ్రవాదంపై చేస్తున్న పోరులో విజయం సాధించ గలుగుతాం.

# జాతీయ విద్యావిధానాన్ని రాష్ట్రాలపై బలవంతంగా రుద్దలేం: సుప్రీం

న్యూఢిల్లీ మే 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



**పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడుల్లో కచ్చితంగా జాతీయ విద్యా విధానం అమలుచేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. విద్యావిధానాన్ని అమలుచేయాలని ఏ రాష్ట్రాన్ని బలవంతం చేయలేమని జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం వెల్లడించింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు పౌరుల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేలా ఉంటే మాత్రం ఆ విషయంలో కోర్టు జోక్యం చేసుకోవచ్చని తెలిపింది.**

తమిళనాడు, పశ్చిమబెంగాల్, కేరళ రాజ్యాంగపరంగా విద్యావిధానాన్ని అమలుచేయాలని పేర్కొంటూ ఓ న్యాయవాది సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. దేశవ్యాప్తంగా విద్యలో ఏకరూపకతను నెలకొల్పడానికి కేంద్రం ఎన్ఈపీ విధానాన్ని అమలుచేయాలని యోచిస్తోందని.. కానీ పలు రాష్ట్రాలు ఈ విధానాన్ని అనవసరంగా రాజకీయ సమస్యగా మార్చడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఉచిత విద్య ఒక ప్రాథమిక హక్కని.. కేంద్రం రూపొందించిన ఆ విధానం అమలును నిరాకరించడం ద్వారా.. రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాల పిల్లలకు ఆ హక్కును దూరం చేస్తున్నాయని పేర్కొన్నారు. కాబట్టి పిల్లలు ప్రభావవంతమైన విద్యను పొందేలా న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ కేసుతో తనకేం సంబంధం ఉందని అత్యున్నత న్యాయస్థానం పిటిషనర్‌ను ప్రశ్నించగా.. తాను తమిళనాడుకు చెందిన వ్యక్తినని.. ప్రస్తుతం ఢిల్లీలో స్థిరపడ్డానని తెలిపారు. దేశ రాజధానిలో స్థిరపడినప్పుడు వివిధ రాష్ట్రాల్లో జాతీయ విద్యావిధానం అమలు గురించి పిటిషన్ దాఖలు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నిస్తూ.. అత్యున్నత న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టేసింది. తన పిల్లలు ఢిల్లీలో హిందీ నేర్చుకోవడం కొనసాగించవచ్చని పిటిషనర్‌కు తెలిపింది. జాతీయ విద్యావిధానం(ఎన్ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రంలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లిషు, ఒక స్థానిక భాషను నేర్చుకోవాలని కేంద్రం పేర్కొంది. అయితే తాము ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డీఎంకే ప్రభుత్వం స్పష్టంచేస్తోంది. 'ఎన్ఈపీ' విషయంలో తమిళనాడు– కేంద్ర ప్రభుత్వాల మధ్య వివాదం కొనసాగుతోంది. రాజకీయ అభిప్రాయ భేదాలకు అతీతంగా దీన్ని అమలుచేయాలని స్టాలిన్‌కు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇటీవల ఓ లేఖలో సూచించారు. అయితే.. తమిళ భాషకు, ప్రజలకు, రాష్ట్రానికి నష్టం కలిగించే చర్యలను అనుమతించేది లేదని తమిళనాడు ముఖ్యమంత్రి పలుమార్లు స్పష్టంచేశారు. మరోవైపు.. జాతీయ విద్యావిధానాన్ని ఆమోదిస్తేనే తమిళనాడుకు నిధులు విడుదలవుతాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

# సరిహద్దుల్లో ఉద్రిక్తతలు.. గుజరాత్ సీఎంకు మోదీ ఫోన్

న్యూఢిల్లీ మే 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



**భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత ముదురుతున్నాయి. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోన్న పాక్.. ఇప్పుడు మనపై రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోంది. డ్రోన్లు, క్షిపణులతో దాడులకు యత్నిస్తోంది. వీటిని భారత బలగాలు సమర్థంగా తిప్పికొడుతున్నాయి. ఈ పరిణామాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. తాజాగా ఆయన గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో ఫోన్‌లో మాట్లాడారు.**

సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ భద్రతా సన్నద్ధతపై ప్రధాని ఆరాతీసి ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. భద్రతాపరంగా సున్నిత ప్రాంతాలైన కచ్, బనస్కంతా, పటాన్, జామ్‌నగర్‌లో పౌరుల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యల గురించి అడిగారు. ఇవన్నీ పాక్‌తో సరిహద్దు కలిగిన ప్రాంతాలు. ప్రస్తుతం శత్రు దేశం నుంచి దాడుల ముప్పు పొంచి ఉన్న వేళ.. సరిహద్దు జిల్లాల్లో యంత్రాంగం అప్రమత్తమైంది. ఎప్పటికప్పుడు అధికారులు ప్రజలకు సూచనలు జారీ చేస్తున్నారు.

### కేంద్రంలో వరుస సమావేశాలు..

మరోవైపు, ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్రం కీలక చర్యలు చేపడుతోంది. ఇప్పటికే రక్షణశాఖ ఉన్నత స్థాయి భేటీ నిర్వహించగా.. ఆర్థిక, హెూం, ఆరోగ్య శాఖల్లోనూ వరుస సమావేశాలు జరుగుతున్నాయి. తమ మంత్రివర్గంలోని ఉన్నతాధికారులతో ఆయా కేంద్రమంత్రులు భేటీ అయ్యారు. సరిహద్దు రాష్ట్రాల్లో పరిస్థితులు, ఆర్థికపరంగా సన్నద్ధత, ఆరోగ్య సేవల అందుబాటు తదితర అంశాలపై చర్చించారు.

# యుద్ధభూమిలో ఏపీ జవాన్ వీర మరణం





జవాన్‌ను మురళీ నాయక్‌గా గుర్తించారు. వీర జవాన్‌ది ఏపీలోని సత్యసాయి జిల్లా గోరంట్ల మండల పరిధిలోని కల్లి తండా. గురువారం రాత్రి సరిహద్దు వెంబడి పాక్ కాల్పులు జరపగా మన సైన్యం కూడా దీటుగానే బదులిచ్చింది. ఈ ఎదురుకాల్పుల్లో మురళీ నాయక్ చనిపోయినట్లు సమాచారం. శనివారం స్వగ్రామానికి వీర జవాన్ పార్థివ దేహం రానున్నట్లు తెలుస్తోంది. కాగా, వీర జవాన్ మురళీ నాయక్ సోమందేపల్లి మండలం నాగినాయని చెరువుతండాలో పెరిగాడు. సోమందేపల్లిలోని విజ్ఞాన్ స్కూల్‌లో చదివాడు. జవాన్ మృతితో ఆయన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో స్వగ్రామం కల్లితండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

**గుండెలవిసేలా ఏడ్చిన తల్లి..**

**ఒక్కగానొక కొడుకు విగతజీవిగా మారడంతో తల్లి రోదన**

మురళీ నాయక్ మరణ వార్త తెలుసుకున్న తల్లి గుండెలవిసేలా రోదిస్తోంది. అల్లారుముద్దుగా పెంచిన ఒక్కగానొక కొడుకు విగతజీవిగా మారడంతో ఆ తల్లి ఏడుస్తున్న తీరు అందరినీ కలచివేస్తోంది. మళ్లీ తన కుమారుడిని చూడలేనంటూ ఇంటికి వస్తున్న బంధువులను పట్టుకుని విలపిస్తోంది. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. జవాన్ ఇతర కుటుంబ సభ్యులు కూడా కన్నీరుమున్నీరు అవుతున్నారు. దీంతో మురళీ నాయక్ స్వగ్రామం కల్లితండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, మురళీ నాయక్ పార్థివ దేహం రేపు స్వగ్రామానికి చేరుకోనుందని సమాచారం.

**ఏపీ జవాన్ వీర మరణంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి**

దేశం కోసం ప్రాణాలర్పించిన అమర వీరుడు మురళీ నాయక్‌కు నివాళులర్పిస్తూ సోషల్ మీడియా వేదికగా పోస్టు ఏపీ సీఎం చంద్రబాబు పెట్టారు. "దేశ రక్షణలో శ్రీసత్యసాయి జిల్లా, పెనుకొండ శాసనసభ నియోజకవర్గం, గోరంట్ల మండలానికి చెందిన మురళీ నాయక్ అనే సైనికుడు ప్రాణాలు కోల్పోవడం విషాదకరం. దేశం కోసం ప్రాణాలర్పించిన అమర వీరుడు మురళీ నాయక్ కు నివాళులు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను" అని సీఎం చంద్రబాబు పోస్ట్ చేశారు.ఖ

## మోడీతోనే దేశ సంరక్షణ

తెలిపారు. ప్రపంచంలో ఎక్కడా హింసకు తావు లేదన్నారు. యుద్ధ సమయంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. భారత్మాతాకీ జై.. అంటూ నినాదాలు చేశారు. వీర మరణం పొందిన మురళీనాయక్‌ఆత్మకు శాంతి కలగాలని రెండు నిముషాలు మౌనం పాటించారు.

**వేగంగా పనులు సాగించాలి : చంద్రబాబు**

అనంతపురం జిల్లా జిల్లాలో పర్యటించిన సీఎం చంద్రబాబు.. ఉరవకొండ నియోజకవర్గం చాయాపురంలో హంద్రీనీవా సుజల స్రవంతి పనులను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. హంద్రీనీవా పనులపై అధికారులు ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కి.మీ మేర సాగుతున్న పనులను డ్రోన్ ద్వారా పరిశీలించారు. ప్రోగ్రామింగ్ ద్వారా రోజూ ఎంతమేర పనులు చేశారో డ్రోన్ ద్వారా పర్యవేక్షించాలని సూచించారు. నాలుగు ఏజన్సీల ద్వారా పనులు జరుగుతున్నాయని ఈ సందర్భంగా అధికారులు సీఎంకు వివరించారు. ఇటీవల నాలుగుసార్లు వర్షాలు కురవడంతో పనులకు కొంతమేర ఆటంకం ఏర్పడిందని తెలుపగా... ఇకపై వేగంగా పనులు సాగించాలని సీఎం సూచించారు. నిర్దేశిత కాలానికి ఎట్టిపరిస్థితుల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# మాది సహాయక పాత్ర మాత్రమే

## 'సింధు జలాల ఒప్పందం'పై ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు

**భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు భగ్గుమంటున్నాయి. దాయాదిని అన్ని వైపుల నుంచి దిగ్బంధిస్తోన్న కేంద్ర ప్రభుత్వం.. సింధుజలాల ఒప్పందం అమలును నిలిపివేసింది. దీనిపై తాజాగా ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగా స్పందించారు. "ఈ ఒప్పందం విషయంలో ప్రపంచబ్యాంక్ జోక్యం చేసుకొని సమస్యను ఎలా పరిష్కరిస్తుందనే దానిపై చాలా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అవన్నీ అర్థం లేనివి. ఈ బ్యాంక్ పాత్ర ఒక సహాయకుడిగా మాత్రమే ఉంటుంది" అని బంగా స్పష్టం చేశారు.**

న్యూఢిల్లీ మే 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ప్రస్తుతం బంగా భారత్‌లో పర్యటిస్తున్నారు. గురువారం ఆయన ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ఈ రోజు ఉత్తర్‌ప్రదేశ్‌తో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కలిశారు. అలాగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల సమయంలో ఆయన మనదేశంలో పర్యటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రపంచ బ్యాంకు అధ్యక్ష పదవిని చేపట్టిన తొలి భారతీయ అమెరికన్‌గా, సిక్కు అమెరికన్‌గా బంగా చరిత్ర సృష్టించారు. ఇదిలా ఉంటే.. సింధు, దాని ఉపనదుల జలాలను పంచుకోవడానికి ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్ పాకిస్థాన్‌ల మధ్య ఒప్పందం కుదిరింది. దీనిపై 1960 సెప్టెంబరులో నాటి భారత ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, పాకిస్థాన్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం సింధు ఉప నదుల్లో తూర్పున పారే రావి, బియాస్, సట్లెజ్ నదులపై భారతదేశానికి హక్కులు లభించాయి. వీటి సగటు వార్షిక ప్రవాహం 33 మిలియన్ ఎకరాల అడుగులు (ఎమ్‌ఏఎఫ్)గా ఉంది. సింధు నదితోపాటు దాని పశ్చిమ ఉపనదులైన జీలం, చీనాబ్‌లపై పాకిస్థాన్‌కు హక్కులు దక్కాయి.

సింధు నదీ జలాల పంపిణీ ఒప్పంద నియమ నిబంధనలపై పునఃసమీక్ష జరపాల్సి ఉందని భారత్ కొంతకాలంగా డిమాండ్ చేస్తోంది. 1960లో ఒప్పందం కుదిరిన నాటికి, ఇప్పటికీ రెండు దేశాల జనాభాలో, తాగు, సాగు నీటి అవసరాలలో చాలా మార్పులు వచ్చాయనీ, పర్యావరణ, భౌగోళిక, రాజకీయపరంగా కూడా మార్పులు చోటుచేసుకున్నాయని గుర్తుచేసింది. వాటిని పరిగణనలోకి తీసుకొని ఒప్పందాన్ని సమీక్షించాల్సి ఉందని భారత్ స్పష్టంచేసింది. అయితే, దీనిపై పాక్ మాత్రం వ్యతిరేకత వ్యక్తంచేస్తూ వస్తోంది. ఈ పరిణామాల వేళ తాజాగా పహల్గాం దాడితో ఈ ఒప్పందం అమలును భారత్ నిలిపివేస్తూ కఠిన నిర్ణయం తీసుకుంది.



# కూలిన సైనిక హెలికాప్టర్ .. ఐదుగురు మృతి

కొలంబో : శ్రీలంకలో శుక్రవారం ఒక సైనిక హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ ఘటనలో ఐదుగురు సైనికులు మరణించినట్లు అధికారులు ఒక ప్ర కటనలో తెలిపారు. సైన్యం, వైమానిక దళానికి చెందిన 12మందిని మిలటరీ పెరేడ్ కోసం తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని వైమానిక ప్రతినిధి ఎరాండా గీగనాగే తెలిపారు. కొలంబోకు ఈశాన్యంగా 280 కిలోమీటర్ల దూరంలో ఉన్న మదురు ఓయాలోని రిజర్వాయర్‌లో కూలిపోయిందని అన్నారు. సైన్యాన్ని బయటకు తీసి, ఆస్పత్రికి తరలించామని అన్నారు. చికిత్స పొందుతూ ముగ్గురు ఆర్మీ, ఇద్దరు వైమానిక దళానికి చెందిన ఇద్దరు మరణించారని గీగనాగె పేర్కొన్నారు. హెలికాప్టర్ ప్రమాదానికి గల కారణం తెలియాల్సి వుంది.

# భానుడి భగభగ...

- ప్రకాశం జిల్లాలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత
- ప్రకాశం దరిమడుగులో 42°C, తిరుపతి గంగుడుపల్లెలో 41.3°C
- రాష్ట్రంలో క్రమంగా పెరుగుతున్న ఎండ తీవ్రత
- కోనసీమ ఆత్రేయపురంలో 63.7మిమీ, చొప్పెలలో 55మిమీ వర్షపాతం
- శనివారం 3 మండలాల్లో తీవ్ర వడగాలులు, 23 మండలాల్లో వడగాలులు.
- అల్లూరి, చిత్తూరు, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో పిడుగులతో వర్షాలు.
- ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఎస్డీఎంఏ సూచన

**ఏపీలో కొన్ని జిల్లాల్లో భానుడు ప్రతాపం చూపిస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో ఆకస్మిక వర్షాలు కురుస్తున్నాయి. నేడు రాష్ట్రంలోని పలుచోట్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదవగా, కొన్ని ప్రాంతాల్లో వర్షం పాతం నమోదైంది. రేపు శనివారం కూడా ఇదే తరహా వాతావరణం కొనసాగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) కీలక సూచనలు జారీ చేసింది. ఇవాళ ప్రకాశం జిల్లా దరిమడుగులో అత్యధికంగా 42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా, తిరుపతి జిల్లా గంగుడుపల్లెలో 41.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు ఏపీఎస్డీఎంఏ తెలిపింది. మరోవైపు, కొన్ని జిల్లాల్లో వాతావరణం చల్లబడింది. కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో అత్యధికంగా 63.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, అదే జిల్లా చొప్పెలలో 55 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఆకస్మిక వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది.**

అమరావతి మే 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)




మంగళగిరి: రాష్ట్రంలో ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ సూచించారు. శుక్రవారం 42°C ఉష్ణోగ్రత రికార్డైందని పేర్కొన్నారు. శనివారం (10-05-25) 42°C- 43.5°C మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. మన్యం జిల్లా పాలకొండ, తూర్పుగోదావరి జిల్లా గోకవరం, కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలాల్లో తీవ్రవడగాలులు(3), 23 మండలాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఆదివారం 7 మండలాల్లో తీవ్ర, 46 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందన్నారు.

మరోవైపు రేపు అల్లూరి సీతారామరాజు, చిత్తూరు, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఇవాళ సాయంత్రం 5 గంటల నాటికి అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో 63.7మిమీ, చొప్పెలలో 55మిమీ, ఆలమూరు 47.5మిమీ, తూర్పుగోదావరి జిల్లా మురమండలో 40.5మిమీ, ఉండ్రాజవరంలో 31.2మిమీ, పశ్చిమగోదావరి జిల్లా దువ్వలో 30మిమీ వర్షపాతం నమోదైందన్నారు. రేపు విజయనగరం-8, పార్వతీపురంమన్యం-9, అల్లూరి సీతారామరాజు-3, కాకినాడ-2, తూర్పుగోదావరి-1 మండలాల్లో (23) వడగాలులు వీచే అవకాశం ఉందన్నారు.

**వాతావరణ సూచన**

రేపు శనివారం రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల నుంచి 43.5 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ అంచనా వేసింది. మూడు మండలాల్లో తీవ్ర వడగాలులు, మరో 23 మండలాల్లో వడగాలుల ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించింది. ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకపోవడం మంచిదని సూచించింది. అదే సమయంలో, రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కూడా కురిసే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ పేర్కొంది. అల్లూరి సీతారామరాజు, చిత్తూరు, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇతర జిల్లాల్లో కూడా చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు పడే సూచనలున్నాయని వివరించింది.

**వడగాలులు వీచే మండలాల వివరాలు లింక్లో:**

https://apsdma.ap.gov.in/…/ శుక్రవారం ప్రకాశం జిల్లా దరిమడుగులో 42C, తిరుపతి జిల్లా గంగుడుపల్లెలో 41.3°C, నంద్యాల జిల్లా దొర్నిపాడు 40.9°C, శ్రీకాకుళం జిల్లా కొల్లివలసలో 40.7°C, చిత్తూరు జిల్లా పిపల్లి, నెల్లూరు జిల్లా దగదర్తిలో 40.6°C చొప్పున అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపారు. ఎండలో బయటకు వెళ్లేప్పుడు నెత్తికి టోపీ పెట్టుకోండి లేదా రూమాలు కట్టుకోండి, తెలుపురంగు గల కాటన్ వస్త్రాలను ధరించండి. అదేవిధంగా మీ కళ్ళ రక్షణ కోసం సన్ గ్లాసెస్ ఉపయోగించండి. చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలి. గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. పిడుగులు, ఈదురుగాలులు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు హోర్డింగ్స్, చెట్ల క్రింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాలు దగ్గర నిలబడరాదన్నారు.





# యుద్ధం వేళ నకిలీ మెసేజ్‌లు..

## నమ్మొద్దు : పీఐబీ ఫ్యాక్ట్

న్యూఢిల్లీ మే 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

భారత్-పాక్ యుద్ధం ఉద్రిక్తతల నేపథ్యంలో %ా% నకిలీ వార్తలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. యుద్ధం కారణంగా %ా% ఏటీఎంలు మూసివేస్తున్నారంటూ వాట్సప్‌లో ఓ సందేశం చక్కర్లు కొడుతోంది. ర్యాన్సమ్‌వేర్ సైబర్ దాడి జరగొచ్చని, అందుకే రెండు నుంచి మూడు రోజులు ఏటీఎంలు మూసివేస్తారని వాట్సాప్ మెసేజ్‌లు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. దీనిపై పీఐబీ ఫ్యాక్ట్ చెక్ చేసింది. అది ఫేక్ వార్త అని స్పష్టం చేసింది. ఏటీఎంలు ఎప్పటిలాగే పనిచేస్తాయని, ఇలాంటి అసత్యవార్తలను ఎవ్వరూ నమ్మొద్దని, షేర్ చేయొద్దని పీఐబీ ఫ్యాక్ట్ సూచించింది.



# ఢిల్లీలో హైఅలర్ట్: ఎయిర్ సైరన్ల టెస్టింగ్

- దేశ రాజధాని ఢిల్లీలో అత్యవసర పరిస్థితులకు విస్తృత ఏర్పాట్లు
- బలగాల మోహరింపు, కంట్రోల్ రూమ్‌లు, ఎయిర్ సైరన్ల ఏర్పాటు
- ప్రభుత్వ కార్యాలయాలు, కీలక ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం
- 11 జిల్లాల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు సైరన్ల వ్యవస్థ

న్యూఢిల్లీ మే 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో, దేశ రాజధాని ఢిల్లీలో ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సర్వసన్నద్ధమవుతోంది. ఎయిర్ సైరన్లను ప్రయోగాత్మకంగా పరీక్షిస్తున్నారు. ప్రతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి, సైరన్లు మోగినప్పుడు ప్రజలు ఎలా స్పందించాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై అవగాహన కల్పిస్తున్నారు.భారీగా భద్రతా బలగాలను మోహరించడం, కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయడం, కీలక ప్రాంతాల్లో ఎయిర్ సైరన్లను అమర్చడం, మాక్ డ్రిల్స్ నిర్వహించడం వంటి చర్యలతో దేశ రాజధాని నగరం అప్రమత్తంగా ఉంది. సరిహద్దు రాష్ట్రాల్లో ఇప్పటికే పలు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్న క్రమంలో, ఢిల్లీలోనూ భద్రతను అత్యంత పటిష్టం చేశారు.ఢిల్లీలోని ప్రభుత్వ కార్యాలయాలు, కీలకమైన స్థావరాల్లో భద్రతను గణనీయంగా పెంచారు. ప్రజలు ఎక్కువగా సంచరించే మార్కెట్లు, రైల్వే స్టేషన్లు, షాపింగ్ మాల్స్, పార్కులు, మెట్రో స్టేషన్లలో నిఘాను ముమ్మరం చేశారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తినా సమర్థవంతంగా స్పందించేందుకు నగర పరిధిలోని 11 జిల్లాలను సంసిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా, ప్రజలను తక్షణమే అప్రమత్తం చేసేందుకు వీలుగా నగరం అంతటా ఎయిర్ సైరన్లను ఏర్పాటు చేసే పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ఏర్పాట్ల గురించి ఢిల్లీ రెవెన్యూ శాఖ అధికారులు మాట్లాడుతూ, "ప్రస్తుతం ఎత్తైన భవనాలపై ఎయిర్ సైరన్లను అమరుస్తున్నాం. వాటి పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. రాబోయే రోజుల్లో మరిన్ని ప్రాంతాలకు ఈ వ్యవస్థను విస్తరిస్తాం. ఇప్పటివరకు 11 జిల్లాల పరిధిలో సుమారు 10 సైరన్లను ఏర్పాటు చేశాం. వీటిలో కొన్ని రెండు కిలోమీటర్ల దూరం వరకు, మరికొన్ని నాలుగు కిలోమీటర్లు, ఇంకొన్ని పదహారు కిలోమీటర్ల పరిధి వరకు స్పష్టంగా వినిపిస్తాయి" అని తెలిపారు.

# తిరుమల ఆలయం మీదుగా ఐదు విమానాలు

## పోలీసులు అప్రమత్తం

తిరుమల, మే 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

: తిరుమలలో మళ్లీ కలకలం రేగింది. శుక్రవారం ఉదయం నుంచి వేంకటేశ్వరుడి ఆలయం మీదుగా ఐదు విమానాలు వెళ్లడం ఆందోళన కలిగిస్తోంది. ప్రతి నిత్యం తిరుమల కొండ పై ఆలయానికి సమీపంగా తరుచూ విమానాలు వెళుతుండటం పట్ల యాత్రికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తిరుమలను నో ఫ్లై జోన్ గా ప్రకటించాలన్న తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) విజ్ఞప్తిని విమానయాన శాఖ పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. తిరుమల ఆలయంపై డ్రోన్లు ఎగరడం, వాటిని టీటీడీ విజిలెన్ స్వాధీనం చేసుకోవడం.. కొన్నిసార్లు కేసులు నమోదైన సంగతి తెలిసిందే. అయితే, ఈ రోజు ఉదయం నుంచి ఏకంగా ఐదు విమానాలు వేంకటేశ్వరుడి ఆలయం పరిసర ప్రాంతాల మీదుగా వెళ్లడంపై యాత్రికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు భారత్-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో %ా%. పోలీసులు అప్రమత్తమయ్యారు. తిరుమల సీవీఎస్‌వో కార్యాలయంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈరోజు మధ్యాహ్నం నుంచి తిరుమలలో భద్రతా బలగాలు తనిఖీలు నిర్వహించనున్నాయి. కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.






డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

శనివారం 10 మే 2025

## హెవీ డ్రైవింగ్ ట్రైనీలకు డిటీఓచే సర్టిఫికెట్ల బహూకరణ



**అమలాపురం, మే 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆర్టీసీ అమలాపురం డిపోలో నిర్వహించుచున్న హెవీ డ్రైవింగ్ స్కూల్ లో 10వ బ్యాచ్ 16 మంది అభ్యర్థులతో 32 రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం అమలాపురం డిపోలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్.టీ.పి రాఘవ కుమార్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విచ్చేసిన డిటీఓ డి.శ్రీనివాసరావు చేతుల మీదుగా అభ్యర్దులకు సర్టిఫికెట్లు అందజేసి, ప్రతీ ఒక్కరూ భద్రతతో కూడిన డ్రైవింగు సామాజిక బాధ్యతగా భావించాలని తెలిపారు. డిపిటీఓ ఎస్.టీ.పి రాఘవ కుమార్ మాట్లాడుతూ శిక్షణ నిమిత్తం ఆర్.టీ.సి. శిక్షణా కళాశాలను ఎంపిక చేసుకున్నందుకు అభినందనలు తెలిపారు. అమలాపురం డిపో మేనేజర్ సి.హెచ్.ఎస్.ఎన్.మూర్తి ఆర్టీసీ శిక్షణ కళాశాలలో డ్రైవర్లకు ప్రాక్టికల్ శిక్షణతో పాటు మెయింటెనెన్స్ విషయమై అవగాహన కల్పించడం జరుగుతుందని, త్వరలో జూన్ నెల రెండవ వారంలో 11వ బ్యాచ్ శిక్షణ తరగతి ప్రారంభమౌతున్నదని, ఆసక్తి గల అభ్యర్థులు ఎండీ. రజాక్, డ్రైవింగ్ ఇన్స్ట్రక్టర్ 7382909588ను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీమతి జి.ఆర్.ఎల్.దేవి అసిస్టెంట్ ఇంజనీర్(మెకానికల్), శ్రీమతి ప్రతిమా కుమారి అసిస్టెంట్ మేనేజర్(ట్రాఫిక్), రామరావు సెక్యూరిటీ యస్.ఐ, వరహాలబాబు ఒ.పి.ఆర్.యస్ సూపర్వైజర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తా

### -ఏపి ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు




**పోలవరం, మే 9 (తెలుగు రాష్ట్రం విలేకరి):**

నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికినిరంతరం కృషి చేస్తానని ఏపి ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పోలవరం మండల కేంద్రంలో ఆయన నివాసం వద్ద నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ బాబు ఆదేశాల మేరకు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలు ఏర్పాటు చేసి ప్రజా సమస్యల పరిష్కారం చేస్తున్నామన్నారు. రోడ్లు, మంచినీరు, పునరావాస కాలనీల మౌళిక వసతులు సదుపాయాల కల్పనపై ప్రజల నుండి వినతిపత్రాలు అందాయని సమస్యలను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా పరిపాలన దిశగా కొనసాగుతుందని ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యల పట్ల సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు అనపర్తి వెం కటనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు బొడ్డు కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి నునకాని రాంబాబు, మాజీ ఉప సర్పంచ్ మంగిన కొండ, పసుమర్తి భీమేశ్వరరావు, పోతుల శ్రీను, దూసనపూడి పోశిబాబు, సత్యన్నారాయణ నారాయణరావు యడ్ల వినోద్, మానికల శ్రీను, బన్ను తదితరులు పాల్గొన్నారు.

## పట్టీసీమ వద్ద రైతులకు విడుదల కాని నీరు

### -సాగునీటి అవసరాలు కోసం అడ్డదారులు





**పోలవరం, మే 9(తెలుగు రాష్ట్రం విలేకరి):**

పోలవరం మండలంలో పట్టిసీమ వద్ద నిర్మించిన పట్టిసీమ మేజర్ ఎత్తిపోతల పథకం నుండి నీటి విడుదల లేకపోవడంతో స్థానిక రైతులు సాగునీటి అవసరాల కోసం అడ్డదారులు తొక్కవలసిన పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి పర్యావసానంగా పట్టిసీమ మేజర్ ఎత్తిపోతల పథకం నిర్వహణ గుత్తేదారులు ప్రతి యేటా పైపులైన్ల మరమత్తులు చేసుకోవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే గతంలో టీడీపీ పాలనలో పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుండి పోలవరం ప్రాజక్టు కుడికాలువకు గోదావరి జలాలు పంపిణీ చేయడానికి పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుండి ఇటుకలకోట డెలివరీ ఛానల్ వరకూ 3.995 కిలోమీటర్ల మేర భారీ పైపులైన్లు ఏర్పాటు చేశారు. ఆ పైపులైన్లకు పలుచోట్ల ఎయిర్వాలను నిర్మించారు. అత్యవసర సందర్భాలలో ఎయిర్ వాల్ మూతలు తీసేలా భారీ ప్లాంట్లు వేసి బోల్టులు బిగించారు. గత రెండేళ్ళుగా మార్చి, ఏప్రిల్ నెలల వరకూ లేతగా ఉన్న వరి మె ఎక్కజొన్న, అపరాల పంటలకు గోదావరిలో నీటిమట్టం 14 మీటర్లకు తక్కువగా ఉం డడం వలన పట్టిసీమ నుండి అధికారులు నీటి సరఫరా చేయలేదు. ఈ నేపథ్యంలో కొం దరు రైతులు ఆ ఎయిర్వాల్ పైపులైన్ల ప్లాంజ్ బోల్డులు ఊడదీసి ఆపైపుల్లో పైపులు వేసి మోటార్ల ద్వారా ఆ నీటిని తోడి సాగునీటికి ఉపయోగిస్తున్నారు. ఈ క్రమంలో బోల్టులు బిగించకుండా వదిలివేయడం, గ్యాస్కట్లు తెగిపోయి లీకేజీలు రావడం వలన ప్లాంజ్లు ఊడి నీటి పంపిణీ సమయాల్లో పైపుల నుండి ఫౌంటెన్లా ఎగజిమ్ముతున్నాయి. వాటిని అదుపుచేయడం మరమ్మత్తులు చేయడం ఎత్తిపోతల పథకం నిర్వహకులకు అదనపు వ్యయం, అదనపు శ్రమతో కూడుకున్న పని కావడం జరుగుతూవస్తున్నాయి. గత ఏడాది జూన్ ఆరవ తేదీన ఇదే విధంగా ప్లాంజ్ లీకై జలాలు వృధాగా పోయాయి. మరమ్మతు బిలు చేయడానికి సిబ్బంది వ్యయప్రయాసలు పడవలసిన పరిస్థితులు ఎదురయ్యాయి. ఈఏడాది కూడా సాగు నీటి కోసం రైతులు 25 ప్రాంతాల్లో ఎయిర్వాల్ ప్లాంజ్ బోల్టులు పీకి నీటిని తోడి వదిలివేయడంతో సమస్యలు అధికమయ్యాయని నిర్వహకులు చెబుతున్నారు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందని, జలవనరులశాఖ అధికారులకు కూడా ఫిర్యాదు చేయడం జరిగిందని నిర్వహక సంస్థ ప్రతినిధి రాజు తెలి పారు. మరమ్మత్తులు పనులు ప్రారంభించండం జరిగిందిదని సమస్యలు తలెత్తిన ప్రాం తంలో మెషిన్లతో పనులు చేయించాల్సి ఉంటుందని కొత్తబోల్టులు గ్యాస్కట్లు వాడవలసి ఉంటుందని అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటే సమస్యలు పునరావృతం కాకుం డా ఉంటాయని నిర్వహకులు కోరుతున్నారు. ఈ విషయంపై పట్టిసీమ ఎత్తిపోతలపథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజుని వివరణ కోరగా ప్రతి యేటా ఇదే తరహాలో జరుగుతుందని రైతులు తమ సాగు నీటి అవసరాలకు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని నిర్వహక ఏజన్సీ ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా రైతులను సమావేశ పరచి అవగాహన కల్పించడం పోలీసు సహాయంతో కౌన్సిలింగ్ ఇప్పించడం ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

## దంపతుల గొడవ -మనస్థాపానికి గురైన భర్త ఆత్మహత్య

**పోలవరం, మే 9(తెలుగు రాష్ట్రం విలేకరి)**

భార్తాభర్తల మద్య విభేదాలు శుక్రవారం ఒక భర్త ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడడానికి కారణమయ్యాయి. పోలవరం ఎఎస్ఐ కె నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం పోలవరం మండలం పట్టిసీమ పంచాయతీ వీరభద్రపురానికి చెందిన మసకపల్లి నాగభూషణం(21) అనే యువకుడికి గత కొన్ని రోజులుగా కుటుంబంలో భార్యతో కలహాల నేపథ్యంలో ఇరువురి మద్య విభేదాలు



పొడచూపాయి. దీంతో భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది. బార్య కాపురానికి రాకపోవడం పట్ల మనస్థాపానికి గురైన నాగభూషణం రాత్రి తన ఇంటిలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బం దువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## జగదేకవీరుడు అతిలోకసుందరి సినిమా రీ రిలీజ్



**జంగారెడ్డిగూడెం, మే 9(తెలుగు రాష్ట్రం విలేకరి):**

జంగారెడ్డిగూడెంలో పిఎన్ఆర్ లో జగదేకవీరుడు అతిలోకసుందరి సినిమా రిలీస్ చేయడం జరిగింది. చిత్రం వచ్చి 35 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా రీ రిలీజ్ చేసిన అభిమానులు, చిరంజీవి నటుడిగా కాకుండా పలు స్వచ్ఛంద సంస్థల ద్వారా సందర్భంగా అభిమానులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

## కిమ్స్ ఆసుపత్రిలో మాక్ డ్రిల్స్ నిర్వహణ








**అమలాపురం, మే 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

భారత్, పాకిస్థాన్ దేశాల నడుమ యుద్ధ వాతావరణ నేపథ్యంలో అంబేద్కర్ జిల్లాలో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు తమను తాము ఎలా రక్షించుకోవాలో అవగాహన కల్పించే ఉద్దేశంతో గురువారం అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో మాక్ డ్రిల్ నిర్వహించారు. భారత్ ,పాకిస్తాన్ మధ్య అసాధారణ పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో, అత్యవసర పరిస్థితులను తట్టుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ను నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పర్యవేక్షణలో అమలాపురం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ మురళి కొండబాబు నేతృత్వంలో జిల్లా అగ్నిమాపక శాఖ ఈ మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించింది. మాక్ డ్రిల్ లో భాగంగా హాస్పిటల్ సిబ్బంది, రోగులు, ప్రజలు ఆసుపత్రి భవనం నుంచి సురక్షితంగా బయటపడే పద్ధతులు, అగ్ని ప్రమాద సమయంలో అనుసరించవలసిన జాగ్రత్తలు, అత్యవసర విరామ మార్గాల వినియోగం వంటి అంశాలపై ప్రాక్టికల్ డెమో ఇచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో అప్రమత్తతను పెంచడమే కాకుండా, విపత్తు సమయంలో వేగవంతమైన స్పందనకు తోడ్పడతాయని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. ప్రజలు ఈ తరహా కార్యక్రమాలను సీరియస్‌గా తీసుకుని, నేర్చుకున్న సూచనలను అమలు చేయాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ మురళి కొండబాబు, అమలాపురం, ముమ్మిడివరం అగ్నిమాపక సిబ్బంది, కిమ్స్ ఆసుపత్రి సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వాడపల్లి భక్తులను ఇబ్బంది పెడుతున్న వ్యాపార మైకుల గోల

### -ఆలయ ప్రదక్షిణ లైన్లు లోనే మార్మోగుతున్నాయి.



**ఆత్రేయపురం, మే 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కోనసీమ తిరుపతిగా ప్రసిద్ధి చెంది రోజురోజుకు విశేష భక్తుల ఆదరణ చూరగొంటున్న వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద వ్యాపార మైకుల గోల అధికమైంది. భక్తుల అసహనానికి గురిచేస్తున్నాయి. “ఏడు శనివారాల వాడపల్లి వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం” అనే నినాదంతో ఈ ఆలయం విపరీతమైన ప్రాచుర్యాన్ని పొందింది. పొందుతూనే ఉంది. అయితే ఈ ఆలయంలో స్వామి వారి దర్శనం ఎంత ముఖ్యమో అంతే ప్రాధాన్యత ఇస్తూ ఈ ఆలయం చుట్టూ ఏడు ప్రదర్శనలను భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో చేపడతారు. గోవింద నామస్మరణలతో తిరుగుతూ ఉంటారు. ఇలా ప్రదక్షిణ చేసే భక్తులకు వ్యాపారులు పెట్టే మైకుల గోల తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. ఈ గోల ఎక్కడో అయితే అంతగా చెప్పుకోనవసరం లేదు. ఏకంగా ప్రదక్షిణ క్యూలైన్ల లోనే. స్థానికంగా ఉండే భక్తులకు ఈ గోల కొంత అలవాటై పోయినప్పటికీ ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఈ మైకుల నుండి తాజా ఉల్లిపాయలు, వెల్లుల్లి పాయలు, పచ్చిమిరప కాయలు వంటి శబ్దాలు అయోమయానికి గురిచేస్తున్నాయి.





కలియుగ వెంకటేశ్వర స్వామి గా ప్రసిద్ధికెక్కిన తిరుమల ఆలయంకు ఏమాత్రం తీసు పోకుండా ప్రతి శనివారం ఇక్కడకు భక్తులు వస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో ఇలాంటి వ్యాపారాల గోల ఉండడం అంత సమంజసమైన విషయం కాదు. తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయ మాదిరిగానే ఇక్కడ కూడా “ఓం నమో వెంకటేశాయ..” అనే స్వరం మైకుల నుంచి వినిపిస్తూ భక్తులను ఆధ్యాత్మికతవైపు నడిపిస్తూ ఉంటుంది. అసలే ఈ మైకల గోలతో విసిగిపోయి మానసిక ప్రశాంతత కోసం ఆలయానికి వస్తుంటే ఈ ఆలయం వద్ద కూడా ఇలాంటి మైకులు ఉండటం చాలా విచారకరం. ఇప్పటికైనా దేవస్థాన అధికారులు, కమిటీ వారు ఈ వ్యాపారాల గోల తగ్గిస్తే మంచిదని భక్తులు కోరుకుంటున్నారు. ఆ వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేసి ప్రదక్షిణ సమయంలో విసిగి పుట్టించకుండా చేయవలసిన బాధ్యత దేవస్థాన అధికారులు పై ఉంటుంది. అలాగే కొందరు వ్యాపారులు ఈ ప్రదక్షిణ లైన్లు లోకి చొరబడి అమ్మకాలు చేపట్టడం కూడా భక్తులకు చిరాకు పుట్టిస్తుంది. అలాగే యాచకుల గోల కూడా ఎక్కువైంది. భక్తులు ఎక్కడ ఉంటే అక్కడ యాచకులు ఉండడం సర్వ సాధారణమే. అయితే ఈ యాచకులు తగిన ప్రదేశాలకు పరిమితం అయితే పర్వాలేదు. ఇలా భక్తిశ్రద్ధలతో ప్రదర్శన చేసే ప్రాంతాల్లోకి రావడం ప్రసిద్ధి చెందిన, చెందుతున్న దేవాలయాలకు మంచిది కాదు. ఈ విషయాలన్నీ దేవస్థానం అధికారులు, కమిటీ వారు గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

ఉభయ గోదావరి

https://epaper.teluguraastram.com

అమలాపురం
మే 10,
శనివారం 2025



# త్వరలోనే సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం

## -మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు



రాజమహేంద్రవరం, మే 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా రాష్ట్ర ప్రజలందరికీ ఒక శుభవార్త అందించనుందని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రతిపాదనల స్థాయిలోనే ఉన్న సన్నబియ్యం పంపిణీ పథకం ఇప్పుడు ఎట్టకేలకు అమలులోకి తీసురానుందని పేర్కొన్నారు. సన్నబియ్యాన్ని ప్రజలకు అందించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పూర్తి చేశారని, ఈ పథకాన్ని రాబోయే జూన్ 12న ప్రారంభించబోతున్నారని తెలిపారు. మొదటిగా రాష్ట్రంలోని పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో ఈ సన్నబియ్యం పంపిణీ చేయనున్నారని, దాదాపు 41,000 ప్రభుత్వ పాఠశాలలు, 4,000 హాస్టళ్లకు ఈ బియ్యాన్ని సరఫరా చేస్తారని వివరించారు. మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు మంచి నాణ్యత కలిగిన బియ్యం అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆదిరెడ్డి అప్పారావు పేర్కొన్నారు. పోషక విలువలు అధికంగా ఉండే ఈ బియ్యం ద్వారా పిల్లల ఆరోగ్యం మెరుగయ్యే అవకాశం ఉందని వివరించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులు, వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు, అలాగే కోట్లాది మంది రేషన్ కార్డుదారులకు లాభం కలగనుందన్నారు. ఇప్పటికే ప్రజలలో ఈ నిర్ణయం పట్ల మంచి స్పందన కనిపిస్తోందన్నారు. ముఖ్యంగా మధ్య తరగతి, పేద కుటుంబాలు దీనిపై ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయన్నారు. కాగా ప్రజావసరాలు తీర్చడంతో పాటు సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుపై ప్రజలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారని పేర్కొన్నారు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించడం, రేషన్ కార్డుదారులకు మంచి బియ్యం అందించడం వంటి నిర్ణయాలు ప్రభుత్వ బాధ్యతను చాటుతున్నాయనిన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ పథకం అమలుపై ఎన్నో ఆరోపణలు వచ్చాయని, ఇప్పుడు అదే పథకాన్ని కూటమి ప్రభుత్వం దీనిని అమలు చేయడంలో ముందుండడం ప్రజలకు కొత్త ఆశలను కలిగిస్తోందన్నారు. వైకాపా మాదిరి తమది ధాబు కబుర్లు చెప్పే ప్రభుత్వం కాదని, తమ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజలకు ఏం కావాలో వాటిని అమలు చేసుకుంటూ అందరి మన్ననలతో ముందుకుసాగే ప్రభుత్వమని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు పేర్కొన్నారు.

# ఫీల్డ్ టెక్నీషియన్-ఎయిర్ కండిషనర్" కోర్సు లో యువతకు ఉచిత శిక్షణ

ఏలూరు మే 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

జిల్లాలోని నిరుద్యోగ యువతకు షార్ట్ టర్మ్ కోర్స్ కింద "ఫీల్డ్ టెక్నీషియన్-ఎయిర్ కండిషనర్" కోర్సు లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక డి. యల్.టి. సి సహాయ సంచాలకులు ఎస్. ఉగాది రవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాశ్ యోజన క్రింద "ఫీల్డ్ టెక్నీషియన్-ఎయిర్ కండిషనర్" కోర్సు లో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పదో తరగతి ఆ పైన ఉత్తీర్ణులైన వారు 18 నుంచి 35 ఏళ్ల లోపు వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను మే, 15వ తేదీలోగా ఏలూరు జిల్లా కలెక్టరేట్ సమీపంలోని డి. యల్.టి. సి. కార్యాలయానికి పంపాలని, వివరాలకు:9493482414. నెంబర్లను సంప్రదించగలరని ఉగాది రవి తెలియజేసారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించడమే ప్రజాదర్బార్ ఉదేశ్యం

## -ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి





దేవీపట్నం, మే9(తెలుగు రాష్ట్రం విలేఖరి):

ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి అన్నారు. శుక్రవారం దేవీపట్నం మండల ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రజలు వినతులు అందజేశారు. తాగునీటి సమస్యలు, గృహ నిర్మాణాలు, కరెంటు, మరి ముఖ్యంగా పోలవరం ఆర్ అండ్ ఆర్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అధిక సంఖ్యలో అర్జీలు అందజేయగా ఆ సమస్యలపై తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే శిరీష దేవి తెలిపారు. అదేవిధంగా సచివాలయ సిబ్బంది విధి నిర్వహణతో అలసత్వం వస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని వారిపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్, దేవీపట్నం మండల టీడీపీ అధ్యక్షుడు మద్రిశెట్ల వెంకటేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షుడు చారపు వెంకటారాయుడు, తహశీల్దార్ కె.సత్యనారాయణ, బిజెపి, అద్యక్షులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# సుదర్శన కలశ ప్రతిష్టోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న చిన్న జీయర్ స్వామీజీ



ఏలూరు మే 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

సమస్త సృష్టిని నడిపించే చైతన్య స్వరూపమే భగవత్ తత్వమని శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామిజీ అభిభాషించారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఏలూరు ఆర్ఆర్ పేట శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో సుదర్శన కలశ ప్రతిష్టోత్సవంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని, క్రతువును ఆధ్యాత్మిక వాతావరణంలో ముందుకు నడిపించారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, మీనా దంపతులు, పాలడుగు రాజేంద్ర ప్రసాద్, రమాదేవి దంపతులు ఆలయ విమాన సుదర్శన శిఖర ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఏలూరు రామచంద్రరావు పేటలో కొలువైయున్న శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో శుక్రవారం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామిజీ ఆలయానికి విచ్చేయడంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో 36వ వార్షిక నవాహ్నిక బ్రహ్మోత్సవ సహిత చతుర్వేద హవన ప్రయుక్త విమాన సుదర్శన కలశ ప్రతిష్టోత్సవం, మహాకుంభాభిషేక మహోత్సవ కార్యక్రమాలు ఈ నెల 3వ తేదీ నుండి ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, చతుఃస్థానార్చన తదితర వైదిక క్రతువులను వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం ఆలయ విమాన సుదర్శన శిఖర ప్రతిష్టా కార్యక్రమాన్ని చేపట్టారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామిజీ, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, మీనా దంపతులు, నగర ప్రముఖులు పాలడుగు రాజేంద్ర ప్రసాద్, రమాదేవి దంపతుల చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. తొలుత చిన జీయర్ స్వామిజీకి ఆలయం వద్ద అపూర్వ స్వాగతం లభించింది. అనంతరం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విమాన సుదర్శన శిఖర ప్రతిష్ట, మహాకుంభాభిషేకం అనంతరం స్వామిజీ భక్తులనుద్దేశించి అభిభాషణ చేశారు. గత 36 సంవత్సరాలుగా ఆర్ఆర్ పేట శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనం, అనుగ్రహం పొందుతోన్న భక్తులంతా ధన్యులని అన్నారు. స్వామి ప్రేరణతో వివిధ సేవాకార్యక్రమాలకు పునరంకితమైన వారు మరింత ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని సూచించారు. సమస్త సృష్టిలోనూ భగవత్ స్వరూపమే నిండి ఉందన్న విషయాన్ని గ్రహించాలని సూచించిన స్వామిజీ,,, దాన్నే జీవితంలో కూడా ఆచరించి చూపాలన్నారు. అనంతరం ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, మీనా దంపతులను, విమాన సుదర్శనాన్ని సమకూర్చిన పాలడుగు రాజేంద్ర ప్రసాద్, వెంకట రమాదేవి దంపతులను స్వామిజీ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ 36 సంవత్సరాలకు ఒకసారి జరిగే ఆలయ విమాన సుదర్శన శిఖర ప్రతిష్ట, కుంభాభిషేక కార్యక్రమాల్లో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని సంతోషం వ్యక్తం చేశారు. శ్రీ వేంకటేశ్వర స్వామివారి దయతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎఎంసి ఛైర్మన్ మామిళ్ళపల్లి పార్ధసారధి, జ్యోతి దంపతులు, మాజీ ఛైర్మన్ కొంపల్లి తాయారు, మాజీ ధర్మకర్త ఈతకోట శ్రీనివాసరావు, పూజారి నిరంజన్, బికెఎస్ఆర్ అయ్యంగార్, కె. కృష్ణమాచార్యులు, డాక్టర్ ముక్కామల పార్ధసారధి తదితరులు పాల్గొన్నారు.



# అవ్వ కోరిక తీర్చిన పవనుడు

## -మురిసిపోయిన అవ్వ-పిఠాపురం అభిమానుల జేజేలు



కాకినాడ మే 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పిఠాపురం ఎమ్మెల్యే, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజాప్రతినిధి అయినప్పటికీ ఆయనకి ఇప్పటికీ సినీ అభిమానులు ఉన్నారు. అభిమానుల పట్ల ఆయన చూపించే ఆదరణ కూడా అలాగే ఉంటుంది.పిఠాపురం నియోజకవర్గం యూ కొత్తపల్లి మండలం కొత్త ఇసుకపల్లికి చెందిన 94 ఏళ్ల పోతుల పేరంటాలు అనే వృద్ధురాలు పవన్ కళ్యాణ్ కు వీరాభిమాని. ఆయన పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నా అని ప్రకటించిన వెంటనే తమ గ్రామ దేవత వేగుళ్ళమ్మ ఆలయానికి వెళ్లి పొర్లు దండాలు పెట్టి పవన్ గెలవాలని కోరుకుంది. ఆయన గెలిస్తే తన సొంత డబ్బులతో గరగ చేయించి ఇస్తానని మొక్కుకుంది. పవన్ గెలిచారు. ఉపముఖ్యమంత్రి అయ్యారు .అయితే ఆమె గరగ చేయించడం అంటే సాధారణ విషయం కాదు. పిల్లలు పెళ్లిళ్లు చేసుకుని వెళ్లిపోయారు. ఆమె ఒక్కతే ఉంటుంది. ఆమెకు వచ్చే నెలకు రూ 4 వేల ఫించన్ మాత్రమే ఆధారం. దీంతో తినీ తినక పింఛన్ డబ్బులు దాచిపెట్టుకుంది .గరగ చేసేందుకు 27 వేలవుతుందని చెప్పారు. ఆ డబ్బులను పోగేసి గరగ చేయించింది. నాలుగు రోజుల క్రితం జన సైనికులతో కలిసి వేగుళ్ళమ్మ ఆలయానికి వెళ్ళింది. ఆలయంలో అమ్మవారికి గరగ సమర్పించింది.తన మనవడు పవన్ ఉపముఖ్యమంత్రి అయిపోయాడు అంటూ హర్షం వ్యక్తం చేసింది. అంతేకాదు తన మనవడితో కలిసి బువ్వ తినాలని ఉంది అంటూ తన మనసులో కోరిక బయటపెట్టింది .ఇది పవన్ కు చేరింది. ఆమెను ప్రత్యేకంగా పిలిపించారు .పిఠాపురం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పాడా ద్వారా ఈ విషయం ఆయనకు తెలిసింది. పాడా ప్రాజెక్టు డైరెక్టర్ చైత్ర వర్షిని ఆమెను కారులో శుక్రవారం మంగళగిరి జనసేన కార్యాలయానికి తీసుకెళ్లారు. ఆమె రాగానే పవన్ ఎదురొచ్చి ఆలింగనంచేసుకున్నారు. అవ్వా ఎలా ఉన్నావ్ అంటూ ఆప్యాయంగా పలకరించారు. నీ కోరిక మేరకే తీసుకొచ్చాను అంటూ ఆయనే దగ్గరుండి భోజనం పెట్టించి కడుపునిండా తిండి పెట్టారు. 94 ఏళ్ల ముదుసలి తన కోసమో, తన కుటుంబ సభ్యుల కోసమో కాకుండా తన కోసం ఎంత కష్టపడింది. అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంది అంటూ పవన్ మునిసిపోయారు. ఆమెతో అరగంటసేపు ముచ్చటించారు. అటు అవ్వ అభిమానం, ఇటు పవన్ కళ్యాణ్ ఆదరణ చూసి ప్రతి ఒక్కరు ఇది కథ అసలు సిసలైన అభిమానం అంటూ నిర్వచనం చెబుతున్నారు.



# భారత జవాన్లకు సెల్యూట్

## -రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి



జంగారెడ్డిగూడెం, మే 9(తెలుగురాష్ట్రం విలేకరి):

పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్లో ఉగ్రవాద శిబిరాలపై భారత్ త్రివిధ దళాలు నిర్వహించిన "ఆపరేషన్ సింధూర్ " సాహసోపేత చర్యగా నిలిచిందని రాష్ట్ర గృహ నిర్మాణం సమాచార పౌరసరఫరాల శాఖ మంత్రి పులుసు పార్థసారథి పేర్కొన్నారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయం సమయంలో మంత్రి కొలుసు పాత్ర పార్థసారథి మాట్లాడుతూ పహాల్గాం లో పర్యటకుల మీద దాడి చేసి 26 మంది మరణానికి కారణమైన ఉగ్రవాదులకు సంబంధించి పాక్ ఆక్రమిత కాశ్మీర్ లోని చివరాలపైన ఈ ఆపరేషన్ లో భారత్ సైన్యం వైమానిక దళం సమన్వయంతో ఖచ్చితమైన దాడులు చేసి, ఉగ్రవాద సంస్థ జైష్ ఏ మహమ్మద్ ప్రధాన కార్యాలయాన్ని వారి శివరాలను ధ్వంసం చేశాయన్నారు. భారత జవానులు చేసిన పోరాటం చరిత్రలో సువర్ణ అధ్యయంగా నిలిచిందని సెల్యూట్ సెల్యూట్ చేస్తున్నానని అన్నారు. భారతదేశ ఉగ్రవాదంపై ఎంత కఠినంగా వ్యవహరిస్తుందో మరోసారి స్పష్టం చేశాయని అన్నారు. భారత సైనికులు ధైర్యసాహసాలు యువతకు దేశభక్తిని మరింత పెంచే అన్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీసుకున్న చర్యల వల్ల అభివృద్ధి చెందిన దేశాల కంటే మన ఆర్థిక వ్యవస్థ ఎంతో మెరుగ్గా ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వివిధ దళ అధిపతులలతో కలసి ఎటువంటి నిర్ణయం తీసుకున్నాను వారికి మనమంతా బాసటగా నిలవాలని రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పులుసు పార్థసారథి అన్నారు.

# వీరమ్మ తల్లి ఊరేగింపు



టి.నర్సాపురం, మే 9(తెలుగు రాష్ట్రం విలేకరి):

టీ. నర్సాపురం మండలం బొర్రంపాలెం గ్రామంలో వీరమ్మ తల్లి ఆలయంలో 36 సంవత్సరాలు వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. హిందూ సాంప్రదాయంతో మేళతాళాలతో వీరమ్మ తల్లి అమ్మవారిని గ్రామంలో ట్రాక్టర్ మీద ఊరేగించారు. భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు పండ్లు పలహారములు అందజేశారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# కిశోరి బాలికల సాధికారత మనందరి బాధ్యత





**అంబాజీపేట మే 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కౌమార దశలో బాలికలందరూ తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని ఎటువంటి రక్తహీనత బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అంగన్వాడి పర్యవేక్షకురాలు వాసర్ల వెంకట మహాలక్ష్మి తెలిపారు. కిశోరి వికాసం- వేసవి శిక్షణ కార్యక్రమాల లో భాగంగా శుక్రవారం మాచవరం పంచాయతీ పరిధిలోని మెట్ల కాలనీ అంగన్వాడీ కేంద్రంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కిశోర బాలికలకు పునరుత్పత్తి ఆరోగ్యం, బాల్య వివాహాల పట్ల కలిగే దుష్ప్రభావాలు పైఅవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేసుకోవాలని , లేకుంటే కలిగే నష్టాలపై వివరించారు. అనంతరం ప్లకార్డు లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి మాట్లాడుతూ వేసవి శిక్షణ కార్యక్రమాలు జూన్ 10వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ మంగళవారం ,శుక్రవారం ప్రతి సచివాలయ పరిధిలో ఈ వేసవి శిక్షణ జరుగుతుందన్నారు. వీటివలన కౌమార దశ బాలికలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. లైంగిక విద్య, బాలల హక్కులు- రక్షణ, ఫోక్సో చట్టం, కౌమార దశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆడపిల్లల పట్ల లింగ వివక్ష ,అసమానతలు, ఉన్నత విద్య నైపుణ్యాలు, మార్గదర్శకత్వం, సైబర్ నేరాలు ,ఆన్లైన్ భద్రత, వివిధ సమస్యలను ఎదుర్కోవడం, ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపు, కౌమార బాలికలు నాయకత్వం, సాధికారత, శారీరక వ్యాయామం, క్రీడలు, ఆటల ప్రాముఖ్యత బాల్యవివాహాలు వలన కలిగే నష్టాల గురించి శిక్షణ కార్యక్రమాలలో వీడియోలు చూపిస్తూ సవివరంగా బాలికలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ జల్లి కనకదుర్గ, అంగన్వాడి కార్యకర్తలు గంటా దుర్గాదేవి, గుబ్బల వెంకటలక్ష్మి, గూటం కృష్ణవేణి, నాగాబత్తుల విజయకుమారి ,కత్తుల రత్నకుమారి, హెల్పర్ కోమలి నాగలక్ష్మి, ఆశా వర్కర్ ముత్తాబత్తుల అనంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

# మే 20 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**-సిఐటియు మండల శాఖ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు**



**చింతలపూడి, మే 9 ( తెలుగు రాష్ట్రం విలేఖరి):**

మే 20వ తేదీన భారతదేశ వ్యాప్తంగా కార్మిక ఉద్యోగ వర్గాలు నాలుగు లేబర్ కోడ్ లు అమలకు నిరసనగా, కనీస వేతనాలుకై, రైతాంగానికి పండించిన పంటకు కనీస గిట్టుబాటు ధర కల్పించాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచి విస్తరింప చేయాలని జరుగుతున్న చారిత్రాత్మక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు చింతలపూడి మండల అధ్యక్షులు నత్త. వెంకటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా సిఐటియు ముద్రించిన నాలుగు లేబర్ కోడ్ ల రద్దుకై సమ్మె ఎందుకు చేయాలనే వివరాలతో ముద్రించిన బుక్లెట్ ను అంగన్వాడి కార్మికులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ప్రాజెక్ట్ కార్యదర్శి టి. మాణిక్యం, ఏఐటియుసి జిల్లా నాయకురాలు జి. అంజమ్మ, బి.ఫణి వర్ధిని సరళ దేవి, ఎం. అరుణ, సీతామహాలక్ష్మి, పాప రత్నం, బి.చెన్నకేశ్వరి, మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద బాధితురాలికి నిత్యావసర సరుకులు పంపిణీ



**జీలుగుమిల్లి, మే 9(తెలుగురాష్ట్రం విలేకరి):**

పి. నారాయణపురం గ్రామంలో నల్గొండ ధనలక్ష్మి కి చెందిన ఇల్లు పూర్తిగా కాలిపోయి సర్వస్వం కోల్పోయిన కుటుంబానికి ఎంపీటీసీ నాలి శ్రీను. వీఆర్వో అశోక్ 20 కేజీల బియ్యం. నిత్యవసర సరుకులను అగ్ని ప్రమాద బాధితుల కుటుంబానికి అందజేశారు. ఈ ప్రమాదంలో పూర్తిగా ఇల్లు సామాన్లు కాలిపోయాయని పదివేల రూపాయల నగదు కూడా కాలిపోయినట్లు బాధితురాలు నల్గొండ ధనలక్ష్మి తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకొని నూతన గృహం మంజూరు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సెక్రెటరీ పద్మ, గంటా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# బుద్ధ పౌర్ణమి నృత్య సంగీత ధ్యాన జ్ఞాన సంబరాలు





**జంగారెడ్డిగూడెం, మే 9(తెలుగు రాష్ట్రం విలేకరి):**

పట్టణంలో శేషాద్రి నగర్ నందలి గౌరీ సుభద్ర పిరమిడ్ ధ్యాన మందిర అనుబంధమైత్రియా మందిరంలో విశాఖ పౌర్ణమి పురస్కరించుకొని మే 11, ఆదివారం సాయంత్రం 6 గంటల నుండి 9 గంటల వరకు బుద్ధ పౌర్ణమి నృత్య సంగీత ధ్యాన జ్ఞాన సంబరాలు నిర్వహిస్తున్నట్లు జంగారెడ్డిగూడెం పిరమిడ్ స్ప్రిపచ్వెల్ ట్రస్ట్ ప్రకటించింది. ప్రతి సంవత్సరం పూజ్య పితామహ సుభాష్ పత్రీజీ ఆశీస్సులతో బుద్ధ పౌర్ణమిని వృత్య సంగీత జ్ఞాన జ్ఞాన అనుసంధానంగా జంగారెడ్డిగూడెం పిరమిడ్ ట్రస్ట్ వైభవంగా నిర్వహిస్తుందని ఈ క్రమంలో 11వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటల నుండి 7 గంటల వరకు చిన్నారులచే వృత్తి ప్రదర్శన అనంతరం, 7:00 నుండి 7:30 వరకు ఈతకోటకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ వై కృష్ణవేణిసే ఉత్త జయంతి ఆధ్యాత్మిక విశేషం అంశంపై ప్రసంగం, 7:30 గంటల నుండి 8:30 వరకు ప్రత్యేక సంగీత ధ్యాన కార్యక్రమంలో భాగంగా షణ్ముఖ ప్రియా సంగీత అకాడమీ వారిచే వీణా కచేరి సామూహిక ధ్యానం చండి ప్రసన్న ఆధ్వర్యంలో ద్వారంపూడి శ్రీదేవి రెడ్డి చే వీణ వాయిద్య కార్యక్రమం ధ్యానుల సామూహిక ధ్యానానుసంధానంతో జరుగుతుందని, 8:30 నుండి 9:30 గంటల వరకు అతిథులకు సత్కారం చిన్నారులకు బహుమతి ప్రధానం అనంతరం సాత్విక శాఖాహారా అల్పాహార విందు ఉంటుందని, ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనవలసిందిగా పిరమిడ్ ట్రస్ట్ అధ్యక్ష కార్యదర్శులు కాకి రామకృష్ణ తడవర్తి కృష్ణ తెలియజేశారు.యానం ద్వారా మానసిక వికాసం, చేరేరేఖ ఆరోగ్యం పొంది అంశాలపై పిరమిడ్ ట్రస్ట్ సమావేశంలో సభికులకు తెలియజేయడంతో పాటు పౌర్ణమి ధ్యానం విశిష్టతను గురించి వస్తుందని ట్రస్ట్ ప్రతినిధులు తెలియజేశారు.

# బాల్యవివాహాల అనర్ధాల గురించి అవగాహన

**కామవరపుకోట, మే9 (తెలుగు రాష్ట్రం విలేకరి):**



బాల్యవివాహాలు చేసుకోవడం వలన కలిగే అనర్ధాలను గురించి కామవరపుకోట మండల కేంద్రంలో అంగన్వాడి సూపర్వైజర్ల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నతనంలోనే పెళ్లి చేయడం వలన తల్లి,బిడ్డ కూడాఅనారోగ్యాల పాలు అవుతారని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తెలిపారు. బాల్యవివాహాలు చేపడితే కఠినమైన శిక్షలకు ఉంటాయన్నారు. సూపర్వైజర్లు వీర కుమారి, మంగాదేవిలు, పి. ప్రశాంతి, రాధిక పాల్గొన్నారు.

# జాతీయ కార్మికులసమ్మెను జయప్రదం చేయండి



**టీ. నర్సాపురం,మే9 (తెలుగు రాష్ట్రం విలేకరి):**

20వ తారీఖున దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెను జయప్రదం చేయండి వ్యవసాయ సంఘం ఈనెల 20వ తారీఖున జాతీయ కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గూడెల్లి వెంకట్రావు పత్రికను ఉద్దేశించి అన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీ ఏపీవో కార్యాలయంలో 20వ తారీఖున ఒకరోజు సమ్మెకు సహకరించి ఉపాధి కూలీలంతా సమ్మెలో పాల్గొనేలా జయప్రదం చేయాలని ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయం సిబ్బంది కట్టప్ప కు మెమరాణం అందించటమైనది సమ్మె నోటీస్ కోట మైనది. 20వ తారీఖున యావన్మంది ఉపాధి కూలీలు అంతా సమ్మె కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి అనుబోలు, ఐద్వా మహిళా సంఘం మండల కార్యదర్శి మడకం కుమారి వ్యవసాయ కార్మిక సంఘం పాల్గొన్నారు.

# డిసిసిబి చైర్మన్ కి శుభాకాంక్షలు తెలిపిన సామినేని



**జగ్గయ్యపేట, మే 9 (తెలుగురాష్ట్రం విలేకరి):**

ఉమ్మడి కృష్ణ జిల్లా డిసిసిబి చైర్మన్ గా నియమితులైన ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్ కి జనసేన పార్టీ యువనాయకులు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ శాలువతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకరరావు, కౌన్సిలర్లు కొలగాని రాము, పాకలపాటి డేవిడ్ రాజు, జనసేన మైనారిటీ నాయకులు షేక్ సత్తార్, కొ అప్షన్ సభ్యులు షేక్ ఖాదర్ బాబు, సర్పంచ్ మద్దుల రామకృష్ణ, మాజీ కౌన్సిలర్ మహమ్మద్ జాన్ బాషా, జనసేన నాయకులు ఆవాల భవానీ ప్రసాద్, చిలుకూరి శ్రీనివాసరావు, శేషం ప్రసాద్, కాసర్ల బాలస్వామి, గుడ్ల రామారావు, నాగంళ్ల సందీప్, గాదె అనిల్, చాపల వెంకటేశ్వర్లు, దేవరగట్ల గోపి, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# చింతలపూడి పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన ఎస్పీ



**చింతలపూడి, మే 9 ( తెలుగు రాష్ట్రం విలేఖరి):**

ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ వార్షిక తనిఖీలలో భాగంగా శుక్రవారం చింతలపూడి పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా చింతలపూడి పోలీస్ సిబ్బంది జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ కి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు "స్వచ్ఛంద ఆంధ్ర %–% స్వర్ణాంధ్ర" కార్యక్రమాలను అమలు చేయాలని సూచించారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న అన్ని రికార్డులను సమీక్షించి, పరిపాలనా విధానాలను మెరుగుపరిచేలా మార్గదర్శకాలు అందించారు.మండల పరిధిలోని ప్రతి గ్రామ సమస్యలను అధికారుల ద్వారా వివరంగా అడిగి తెలుసుకున్నారు.గ్రామాల్లో చిన్న సమస్యలు తలెత్తిన వెంటనే అధికారులే పరిష్కారం చేసేందుకు ముందడుగు వేస్తే, భవిష్యత్తులో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉంటుంది అని స్పష్టం చేశారు.మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని ఆదేశించారు.డ్రోన్ కెమెరాల పర్యవేక్షణ ద్వారా నేరాలను గుర్తించి, ట్రాఫిక్ సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలి. హైస్కూల్, కాలేజీలు, రద్దీ ప్రదేశాలలో "శక్తి యాప్" పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.మహిళలు బాలికలు ఈ యాప్ ఉపయోగించడం ద్వారా సురక్షితంగా ఉండేలా వారిలో విశ్వాసం పెంపొందించాలి.ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో వచ్చిన సమస్యలపై తక్షణ చర్యలు తీసుకొని, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలి.అధికారులు సమిష్టిగా పనిచేస్తూ రహదారి ప్రమాదాలను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. డ్రోన్ పర్యవేక్షణ ద్వారా ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలి.ప్రజలకు సీసీటీవీల వినియోగంపై అవగాహన కల్పించి, స్టేషన్ల పరిధిలోని వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్లు, రహదారులు, ప్రజా ప్రదేశాల్లో సీసీటీవీ ఏర్పాటు చేయడం వల్ల దర్యాప్తుకు ఎంతగా ఉపయోగపడుతుందో తెలియజేయాలి అన్నారు.పోలీస్ సిబ్బందికి స్పష్టమైన మార్గదర్శకాలు అందించి, శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజా సమస్యల పరిష్కారం అంశాల్లో మరింత ప్రభావవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆపరేషన్ సింధూరం పురస్కరించుకుని ఎటువంటి అసత్య ప్రచారాలు చేయకుండా చూడాలని, అన్ని ప్రాంతాలలో క్షుణ్ణంగా పరిశీలన చేయాలని కొత్త వ్యక్తుల కథలు పై నిఘా ఉంచాలని వాట్సప్ ద్వారా జరిగే ప్రచారాలపై ఏదైనా అనుమానాస్పద ప్రచారాలు జరిగితే వాటిపై వాటి యొక్క అడ్మిన్లపై కూడా చర్యలు తీసుకుంటామని ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని ఏదైనా విపత్కర పరిస్థితి ఎదురైన సమయంలో ప్రజలు వారి యొక్క ప్రాణాన్ని ఎలా సంరక్షించుకోవాలనే విషయాలపై మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం డిఎస్పి రవిచంద్ర, చింతలపూడి ఇన్స్పెక్టర్ రాజశేఖర్, చింతలపూడి ఎస్సై కుటుంబరావు, పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎస్పీ



**చింతలపూడి, మే 9 ( తెలుగు రాష్ట్రం విలేఖరి):**

చింతలపూడి పట్టణంలో మెగా రక్తదాన శిబిరాన్ని శుక్రవారం ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ప్రారంభించారు. ఈ మెగా రక్తదాన శిబిరంలో రక్తాన్ని దానం చేసిన దాతలను ఎస్పీ అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా రక్తదానం ఎంతో గొప్పదని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం వలన ఆపద సమయంలో ఉన్నటువంటి ప్రజలకు పునర్జన్మ ప్రసాదించిన వారు అవుతారని ప్రతి ఒక్కరూ రక్తదానాన్ని ప్రోత్సహించాలని తల సేమియా వ్యాధిగ్రస్తులు నిత్యం వారి యొక్క రక్తం తగ్గిపోవడం వలన మీరిచ్చే రక్తమే వారికి ప్రాణాలను కాపాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం డిఎస్పి రవిచంద్ర, చింతలపూడి సిఐ రాజశేఖర్, ఎస్సై కుటుంబరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● భారత్ - పాక్ ఉద్రిక్తతల ఎఫెక్ట్..

# ఐపీఎల్ 2025 వారం పాటు వాయిదా

**ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్ వాయిదా పడింది. భారత్ - పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఈ టోర్నీ నిర్వహణకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఐపీఎల్ మ్యాచ్‌లను వారం రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు టోర్నీ నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు.**




"ప్రస్తుత పరిస్థితుల్లో అనేక ఫ్రాంఛైజీలు ఆటగాళ్ల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశాయి. దీనిపై ఐపీఎల్ పాలక మండలిలో చర్చించాం. ప్రసారకర్తలు, స్పాన్సరర్లు, అభిమానుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నాం. మన సాయుధ బలగాల స్థైర్యం, సన్నద్ధతపై మాకు పూర్తి విశ్వాసం ఉన్నప్పటికీ.. అందరి అభిప్రాయాలను గౌరవించి ఈ నిర్ణయం తీసుకున్నాం.ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో దేశానికి బీసీసీఐ పూర్తి మద్దతు ప్రకటిస్తోంది. మన సాయుధ బలగాల ధైర్యం, నిస్వార్థ సేవకు సెల్యూట్ చేస్తున్నాం" అని ఐపీఎల్ తమ 'ఎక్స్' ఖాతాలో రాసుకొచ్చింది.

ఆటగాళ్ల భద్రత విషయంలో రాజీ పడకూడదనే ఉద్దేశంతో టోర్నీని కొంతకాలం వాయిదా వేసినట్లు బీసీసీఐ అధికారులు పేర్కొన్నారు. "ఓవైపు దేశం యుద్ధం చేస్తుంటే.. ఇలాంటి సమయంలో క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించడం సరైంది కాదనిపించింది" అని వెల్లడించారు. ఇప్పటికే పంజాబ్, దిల్లీ మ్యాచ్ భద్రతా కారణాలరీత్యా మధ్యలోనే రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఇవాళ లఖ్‌నవూ - ఆర్సీబీ మధ్య లఖ్‌నవూలోని ఏకనా స్టేడియంలో మ్యాచ్ జరగాల్సి ఉండగా.. నేటి నుంచి నిలిపివేత అమల్లోకి రానుంది. ప్రస్తుత సీజన్‌లో ఇంకా 12 లీగ్ మ్యాచులు ఉన్నాయి. రెండు క్వాలిఫయర్లు, ఒక ఎలిమినేటర్, ఫైనల్ మ్యాచ్ మిగిలి ఉంది. షెడ్యూల్ ప్రకారం మే 25న కోల్‌కతా వేదికగా ఐపీఎల్ ఫైనల్ ఉంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో గుజరాత్ (16), బెంగళూరు (16), పంజాబ్ (15), ముంబయి (14) ఉన్నాయి.

ఐపీఎల్ ఆటగాళ్ల 'ప్రత్యేక రైలు'కు అనుమతి లేదా?

భారత్ - పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తత నేపథ్యంలో ఐపీఎల్ నిరవధికంగా వాయిదా పడింది. ధర్మశాలలో ఉన్న పంజాబ్, దిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లను, సిబ్బందిని అక్కడినుంచి దిల్లీకి తరలించేందుకు తొలుత ప్రత్యేక రైలును బీసీసీఐ ఏర్పాటుచేసింది. వందేభారత్‌లో తరలించేందుకు సిద్ధమైంది. అయితే, తాజా కథనాల ప్రకారం.. ఆ రైలు వెళ్లేందుకు రైల్వేశాఖ అనుమతి ఇవ్వలేదని తెలుస్తోంది. పఠాన్‌కోట్ మీదుగా వెళ్లాల్సిన నేపథ్యంలో రిస్క్ తీసుకోదలుచుకోలేదని రైల్వే వర్గాలు తెలిపాయి. దీంతో మరోవిధంగా ఆటగాళ్లను తరలించేందుకు బీసీసీఐ ఏర్పాట్లు చేస్తోంది. బస్సుల్లో దిల్లీకి తీసుకెళ్లాలని భావిస్తోంది.

# కాంపౌండ్ సెమీస్‌లో మధుర, రిషభ్

## ఆర్చరీ ప్రపంచకప్‌లో భారత రికర్వ్ జట్లు ఔట్

**ఆర్చరీ ప్రపంచకప్‌లో భారత కాంపౌండ్ ఆర్చర్ల మెరుగైన ప్రదర్శన కొనసాగుతోంది. కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో గురువారం రిషభ్ యాదవ్, మధుర సెమీఫైనల్లో ప్రవేశించారు. పురుషుల క్వార్టర్స్ షుటాఫ్‌లో రిషభ్ 10-10తో మథియాస్ ఫులెర్టన్‌పై గెలిచాడు.**



**షాంఘై:** ఆర్చరీ ప్రపంచకప్‌లో భారత కాంపౌండ్ ఆర్చర్ల మెరుగైన ప్రదర్శన కొనసాగుతోంది. కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో గురువారం రిషభ్ యాదవ్, మధుర సెమీఫైనల్లో ప్రవేశించారు. పురుషుల క్వార్టర్స్ షుటాఫ్‌లో రిషభ్ 10-10తో మథియాస్ ఫులెర్టన్‌పై గెలిచాడు. ఇద్దరి స్కోర్లు సమమైనప్పటికీ తన బాణం సెంటర్‌కు దగ్గరగా ఉండడంతో రిషభ్ విజేతగా నిలిచాడు. మహిళల క్వార్టర్స్‌లో మధుర 142-141తో వెన్నం జ్యోతి సురేఖను ఓడించింది. బుధవారం భారత పురుషులు, మహిళల కాంపౌండ్ జట్లు ఫైనల్‌కు చేరిన సంగతి తెలిసిందే. మరోవైపు భారత రికర్వ్ జట్లు నిష్క్రమించాయి. పురుషుల జట్టు నాలుగో స్థానంతో సరిపెట్టుకోగా.. మహిళల జట్టు క్వార్టర్‌ఫైనల్లో ఓడిపోయింది. ధీరజ్ బొమ్మదేవర, అతాను దాస్, తరుణ్‌దీప్ రాయ్‌లతో కూడిన పురుషుల టీమ్ కాంస్య పతక పోరులో 3-5తో అమెరికా జట్టు చేతిలో ఓటమి చవిచూసింది. ఈ జట్టు అంతకుముందు సెమీఫైనల్లో షుటాఫ్‌లో ఫ్రాన్స్ చేతిలో కంగుతింది. ఇక భారత మహిళల జట్టు ప్రిక్వార్టర్స్ షుటాఫ్‌లో 4-5తో మెక్సికో

# మేమంతా మీ వెంటే..

## త్రివిధ దళాలకు మద్దతుగా క్రీడాకారులు

**'ఆపరేషన్ సిందూర్' అనంతరం భారత్ - పాక్ మధ్య అలజడి వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. దేశ సరిహద్దుల్లో పాక్ పాల్పడుతున్న దుశ్చర్యలను భారత సైన్యం సమర్థవంతంగా తిప్పికొడుతోంది. దేశ ప్రజల సంరక్షణ కోసం శ్రమిస్తోన్న త్రివిధ దళాలకు దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తోంది. సైన్యం సేవలను కొనియాడుతూ తాజాగా పలువురు క్రీడాకారులు సోషల్‌మీడియా వేదికగా పోస్టులు పెట్టారు. సైన్యం వెంటే తాము ఉన్నట్లు తెలిపారు.**






"దేశ సంరక్షణలో భాగంగా మన సైన్యం తీసుకునే ప్రతీ నిర్ణయాన్ని గౌరవిస్తున్నా. మన దేశ గౌరవాన్ని పెంచడంలో వారు ఎప్పుడూ ముందుంటారు. కాబట్టి, ఇలాంటి క్లిష్ట సమయాల్లో తప్పుడు కథనాల వ్యాప్తి, అలాంటి వార్తలను నమ్మకుండా ప్రతీ భారతీయుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి" - క్రికెటర్ రోహిత్ శర్మ

"క్లిష్ట సమయంలో అనుక్షణం దేశాన్ని సంరక్షిస్తోన్న మన సైనికులకు సెల్యూట్. మన వీరుల అచంచల ధైర్యసాహసాలకు, దేశం కోసం వారితోపాటు వారి కుటుంబాలు చేసే త్యాగాలకు మనమంతా ఎప్పటికీ రుణపడి ఉండాలి" - విరాట్ కోహ్లీ

"మీ ధైర్యం, క్రమశిక్షణ, త్యాగమే మన జాతికి బలం. ఆపరేషన్ సిందూర్ వంటి పరిస్థితుల వేళ మన త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన మీ ధైర్యం, నిస్వార్థ సేవలను ఎల్లవేళలా మేము గుర్తు చేసుకుంటాం. దేశం మొత్తం మీ వెంట నడుస్తోంది" - బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు

"జమ్మూపై పాక్ చేపట్టిన డ్రోన్ దాడిని సమర్థవంతంగా అడ్డుకున్న పోరాట యోధులను గౌరవిద్దాం" - క్రికెటర్ శిఖర్ ధావన్

# ఆపరేషన్ సిందూర్.. పాక్‌లో పీఎస్‌ఎల్‌పై తీవ్ర ప్రభావం





కరాచి: పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్‌ఎల్)పై ఆపరేషన్ సిందూర్ తీవ్ర ప్రభావం చూపుతోంది. పీఎస్-ఎల్ నిర్వహణే సందిగ్ధంలో పడింది. గురువారం రావల్పిండిలో కరాచి కింగ్స్, పెషావర్ జాల్మి మధ్య జరగాల్సిన మ్యాచ్ రద్దయింది. లాహోర్, రావల్పిండి సహా పాక్‌లోని పలు రక్షణ రాడార్ వ్యవస్థలను భారత్ లక్ష్యంగా చేసుకోవడంతో మ్యాచ్ రద్దు అనివార్యమైంది. త్వరలోనే మ్యాచ్ నిర్వహణ తేదీని ప్రకటిస్తామని పీసీబీ ప్రకటించింది. ఆరు జట్లు బరిలో ఉన్న పీఎస్‌ఎల్ ఈనెల 18న లాహోర్‌లో ముగియనుంది. ప్రస్తుతం రావల్పిండిలో చివరి దశ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. రావల్పిండి స్టేడియం సమీపంలో డ్రోన్ దాడి జరిగిన నేపథ్యంలో ఆ దేశంలో ఉంటూ క్రికెట్ ఆడాలా? వద్దా? అనే విషయంలో ఇంగ్లాండ్ ఆటగాళ్లు పునరాలోచనలో పడినట్లు కథనాలు వస్తున్నాయి. ప్రస్తుతం కొందరు ఆటగాళ్లు పాక్‌లో ఉండాలని భావిస్తున్నప్పటికీ మరికొందరు స్వదేశం వెళ్లేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇంగ్లాండ్ నుంచి జేమ్స్ విన్స్, టామ్ కరన్, సామ్ బిల్లింగ్స్, క్రిస్ జోర్డాన్, డేవిడ్ విల్లీ, లూక్ వుడ్, టామ్ కోహ్లర్ పీఎస్-ఎల్‌లో ఆడుతున్నారు. ఇంగ్లాండ్ కోచ్ రవి బొపార, అలెగ్జాండ్ర హార్ట్లీ లీగ్‌లో కొనసాగుతున్నారు. డేవిడ్ వార్నర్ (కరాచి కింగ్స్), జేసన్ హోల్డర్, వాండర్ డసెన్ (ఇస్లామాబాద్ యునైటెడ్) కూడా లీగ్‌లో ఆడుతున్నారు.

# భయమేసింది.. బాంబులు పడతాయని అరుపులు

## ఛీర్‌లీడర్ వీడియో వైరల్

భారత్ - పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఐపీఎల్ 2025 సీజన్‌లో తొలిసారి మ్యాచ్‌ను మధ్యలోనే రద్దు చేసిన సంగతి తెలిసిందే. ధర్మశాల వేదికగా పంజాబ్ కింగ్స్, దిల్లీ క్యాపిటల్స్ మధ్య మ్యాచ్ రద్దైంది. భద్రతా కారణాలతోనే ఆపేసినట్లు హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ బోర్డు వెల్లడించింది. ఐపీఎల్ ఛైర్మన్ ధుమాల్ కూడా ప్రేక్షకులు త్వరగా వెళ్లిపోవాలని విజ్ఞప్తి చేశాడు. జమ్మూకశ్మీర్, పఠాన్‌కోట్ ప్రాంతాల్లో పాక్ దాడులు చేసేందుకు ప్రయత్నించడంతో ధర్మశాలలో ముందస్తుగా ఆటను నిలిపేసినట్లు తెలుస్తోంది. దీంతో ఆటగాళ్లు, సపోర్ట్ సిబ్బంది, ఐపీఎల్ సభ్యులు, ప్రేక్షకులు మైదానాన్ని ఖాళీ చేసేశారు. ఈ క్రమంలో ఓ ఛీర్‌లీడర్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.




"స్టేడియం మొత్తం ఖాళీ అయిపోయింది. మ్యాచ్ మధ్యలోనే అందరినీ పంపించేశారు. ఇక్కడంతా భయంగా ఉంది. ప్రతిఒక్కరూ బాంబులు వస్తాయేమోనని అరుస్తూ వెళ్లిపోయారు. ధర్మశాలను వదిలి వెళ్లడం బాధగా ఉంది. ఐపీఎల్ ప్రతినిధులు సరైన చర్యలు తీసుకున్నారు. అయితే, నేను ఎందుకు ఏడవడం లేదనేది తెలియడం లేదు. ఇప్పటికీ షాక్‌లోనే ఉన్నా' అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలతో వీడియో వైరల్‌గా మారింది.

### ఆటగాళ్ల కోసం ప్రత్యేక రైలు ఏర్పాటు

ధర్మశాల నుంచి ఆటగాళ్లను తరలించేందుకు బీసీసీఐ ప్రత్యేక రైలును ఏర్పాటుచేసింది. ధర్మశాలలో విమానాశ్రయాలను మూసివేసిన సంగతి తెలిసిందే. దీంతో దిల్లీకి తీసుకెళ్లేందుకు వందే భారత్ రైలును బీసీసీఐ అధికారులు ఏర్పాటుచేశారు. దాడుల నేపథ్యంలో ఐపీఎల్ నిర్వహణపై ఛైర్మన్ అరుణ్ ధుమాల్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ధర్మశాలకు దగ్గరగా ఉండే ఉనా స్టేషన్ నుంచి రెండు జట్ల ప్లేయర్లు, సపోర్ట్ స్టాఫ్, మ్యాచ్ అధికారులను తరలించనున్నట్లు క్రికెట్ వర్గాలు తెలిపాయి.

# పాక్ యుద్ధాన్ని ఎంచుకుంది.. ఎప్పటికీ మరిచిపోలేని సమాధానం ఇస్తాం: సెహ్వాగ్

తమ దేశంలో ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన భారత్‌పై పాకిస్థాన్ దాడి చేయడం మొదలుపెట్టింది. రెచ్చగొట్టేలా క్షిపణులు, ఆత్మాహుతి డ్రోన్లు, యుద్ధ విమానాలను ప్రయోగించింది. వాటన్నింటినీ భారత ఆర్మీ తిప్పికొట్టింది. ఈక్రమంలో టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ సోషల్ మీడియా వేదికగా పాక్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాడు. పాక్ యుద్ధం కోరుకుందని.. భారత్ సరైన గుణపాఠం చెబుతుందని పేర్కొన్నాడు. భారత ఆర్మీపై జావెలిన్ త్రో స్టార్ నీరజ్ చోప్రా కూడా ప్రశంసల వర్షం కురిపించాడు. "ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసినప్పుడు పాక్ మౌనంగా ఉండాలి. కానీ, ఆ ఛాన్స్‌ను వదులుకొని యుద్ధం కోరుకుంది. ఉగ్రవాదుల ఆస్తులను రక్షించడం, వారి గురించి ఎక్కువగా మాట్లాడటం చేసింది. దానికి మన భద్రతా దళాలు తప్పకుండా సరైన సమాధానం ఇస్తుంది. అదీనూ పాకిస్థాన్ ఎప్పటికీ మరిచిపోలేని రీతిలో ఉంటుంది" అని సెహ్వాగ్ పోస్టు పెట్టాడు. "అత్యంత ధైర్యవంతమైన భారత ఆర్మీ పట్ల గర్వపడుతున్నాం. దేశం కోసం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న భద్రతా దళాలకు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుంది. ఇలాంటి సమయంలో ప్రతిఒక్కరూ ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాలను పాటించి సురక్షితంగా ఉండాలి. జై భారత్, జై భారత్‌కీ సేన" అని నీరజ్ చోప్రా పోస్టు చేశాడు. "సరిహద్దుల్లో పాక్ చేసిన డ్రోన్ దాడులను భారత్ సమర్థవంతంగా అడ్డుకొంది. ధైర్యసాహసాలు కలిగిన భారత సైన్యం నిబద్ధతకు ఇదే నిదర్శనం. భారత్ బలంగా నిలబడుతుంది. జై హింద్" అని మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ స్పందించాడు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# పాక్ నటుడు ఫవాద్‌ఖాన్ పై నటి రూపాలి గంగూలీ ఫైర్





**–ఫవాద్‌ఖాన్ వ్యాఖ్యలపై రూపాలి గంగూలీ ఘాటుగా: 'ఆపరేషన్ సిందూర్'పై వ్యాఖ్యలు అంగీకారయోగ్యం కావు!**

భారత సాయుధ బలగాలు ఇటీవల పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' పేరిట పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) సహా పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ ఆపరేషన్ దేశవ్యాప్తంగా ప్రశంసల పంట కురిపించగా, "ఈ సిగ్గుచేటైన దాడిలో మరణించిన, గాయపడిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపం. మృతుల ఆత్మకు శాంతి కలగాలని, వారి ఆప్తులకు ధైర్యం చేకూరాలని ప్రార్థిస్తున్నాను. రెచ్చగొట్టే మాటలతో మంటలు రేపడం ఆపండి. అమాయకుల ప్రాణాల కంటే ఏదీ ముఖ్యం కాదు. మంచి బుద్ధి ప్రసాదించు గాక. ఇన్షా అల్లా. పాకిస్థాన్ జిందాబాద్!" అని ఫవాద్ ఖాన్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు.ఈ వ్యాఖ్యలపై ప్రముఖ భారత టెలివిజన్ నటి రూపాలి గంగూలీ తీవ్రంగా స్పందించారు. ఫవాద్ ఖాన్ ఇన్‌స్టా స్టోరీ స్క్రీన్‌షాట్‌ను ఆమె తన ఎక్స్ ఖాతాలో పంచుతూ, "మీరు భారతీయ సినిమాల్లో పనిచేయడం మాకే 'సిగ్గుచేటు'" అని రూపాలి ఘాటుగా బదులిచ్చారు. గతంలో ఫవాద్ ఖాన్ నటించిన 'ఖూబ్‌సూరత్', 'కపూర్ సన్స్', 'యే దిల్ హై ముష్కిల్' చిత్రాలను గుర్తు చేస్తూ రూపాలి ఆయనకు తగిన గుణపాఠం చెప్పారు. దేశం పై వ్యతిరేక వ్యాఖ్యలు చేసే వ్యక్తులు భారతీయ సినీ పరిశ్రమలో ఎలా స్థానం సంపాదించారనే అంశంపై ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పాక్ నటుడు ఫవాద్‌ఖాన్ పై నటి రూపాలి గంగూలీ ఫైర్ఓటీటీలపై పాక్ కంటెంట్ నిషేధాన్ని స్వాగతించిన రూపాలిఇటీవల, కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ దేశంలోని అన్ని ఓటీటీ వేదికలపై పాకిస్థాన్‌కు చెందిన కంటెంట్‌ను తక్షణమే నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది. "జాతీయ భద్రత దృష్ట్యా దేశీయ డిజిటల్ వేదికలపై పాక్ కంటెంట్‌కు ఇక చోటుండదు. సినిమాలు, వెబ్‌సిరీస్‌లు, పాటలు, పాడ్‌కాస్ట్‌లు వంటి మీడియా అంశాల ప్రసారాన్ని నిలిపివేయాలని స్పష్టమైన నోటీసు జారీ చేసింది" మంత్రిత్వ శాఖ. ఈ నిర్ణయాన్ని కూడా రూపాలి గంగూలీ హర్షంగా స్వాగతించారు. "ఉద్రిక్తతల సమయంలో మన డిజిటల్ సరిహద్దులను కాపాడుకోవాలి. పాక్ కంటెంట్ నిషేధానికి మోదీ ప్రభుత్వానికి హ్యాట్సాఫ్!" అంటూ ఆమె ట్వీట్ చేశారు. దేశ భద్రతకు సంబంధించి ఇటువంటి చర్యలు అవసరమేనని ఆమె అభిప్రాయపడ్డారు.బాలీవుడ్‌లోకి ఫవాద్ రీఎంట్రీ ప్రశ్నార్థకంఫవాద్ ఖాన్ 'అబీర్ గులాల్' అనే భారతీయ చిత్రంతో మళ్లీ బాలీవుడ్‌కు తిరిగివచ్చే ప్రయత్నంలో ఉన్నారు. అయితే ఏప్రిల్‌లో జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి, ఆ తర్వాత పెరిగిన భారత్–పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ సినిమా విడుదల అనిశ్చితంలో పడింది. వాస్తవానికి ఈ చిత్రం నేడు థియేటర్లలో విడుదల కావాల్సి ఉండగా, తాజా పరిణామాల నేపథ్యంలో నిర్మాతలు వాయిదా వేయాలని నిర్ణయించారు. ఫవాద్ వ్యాఖ్యలతో ఇప్పటికే సోషల్ మీడియాలో వ్యతిరేకత పెరుగుతున్న తరుణంలో ఆయన బాలీవుడ్‌లోకి రీఎంట్రీ సాధ్యమా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. సినీ ప్రేక్షకులు, జాతీయవాద భావజాలాన్ని గౌరవించే వ్యక్తులు ఈ చిత్రాన్ని బహిష్కరించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.దేశభక్తికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు సహించం: నెటిజన్ల ఆగ్రహంఫవాద్ ఖాన్ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలకు గురి చేసాయి. అనేక మంది నెటిజన్లు ఆయనను బహిష్కరించాలని, గతంలో ఆయన భారతీయ సినిమాల్లో నటించడాన్ని సైతం తిరస్కరించారు. "భారతీయ చిత్రసీమ మీకు పేరు, డబ్బు ఇచ్చింది. ఇప్పుడు అదే దేశాన్ని విమర్శించడం అనైతికం" అంటూ నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు. రూపాలి గంగూలీ స్పందనకు మద్దతు తెలియజేస్తూ పలువురు ప్రముఖులు కూడా సోషల్ మీడియాలో స్పందించారు. దేశ భద్రతను గౌరవించని వారికి భారత్‌లో స్థానం ఉండదన్న సందేశం మరింత బలంగా వినిపిస్తోంది.

# ఆపరేషన్ సిందూర్‌కు


## టార్గెట్ అయిన జూనియర్ ఎన్టీఆర్ .ఇంత దారుణమా..





యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటన , డ్యాన్స్ గురించి ఎంత చెప్పుకున్న తక్కువే. నందమూరి కుటుంబం నుంచి హీరోగా ఎంట్రీ ఇచ్చినప్పటికి, అనతి కాలంలోనే ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు దక్కించుకున్నారు.చిన్న వయస్సులోనే ఇండస్ట్రీ హిట్ కొట్టి స్టార్ హీరోలను వణికించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుంది. వరుస హిట్లను సాధిస్తూ స్టార్ హీరోగా మారారు.ఎన్టీఆర్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా మారాడు. ఇదిలా ఉంటే జూనియర్ ఎన్టీఆర్ ఒక్కసారిగా సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో వచ్చారు. ఆయన్ను కొందరు నెటిజన్లు టార్గెట్ చేసుకుని విమర్శలు గుప్పిస్తున్నారు. అసలు విషయం ఏమిటంటే... పహెల్గాం దాడి తర్వాత ఇండియాలో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. ముఖ్యంగా ఉగ్రవాదులు హిందువులా, ముస్లింలా అని అడిగి మరీ హిందువులను కాల్చి చంపారు.దానికి ప్రతిచర్యగా భారత్ సైతం పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులపై దాడి చేసింది. ప్రస్తుతం ఇండియా– పాక్ మధ్య యుద్ధం సాగుతుంది. ఇటువంటి తరుణంలో కొందరు దుర్మార్గులు జూనియర్ ఎన్టీఆర్‌ను టార్గెట్ చేసుకుని అతనికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. జూనియర్ ఎన్టీఆర్ ముస్లిం వ్యక్తి అని, అతను నందమూరి తారక రామారావుగా మార్చుకున్నారని నెటిజన్లు గుర్తు చేస్తున్నారు.ఎన్టీఆర్ పేరు మార్చుకున్న తర్వాతే అతనికి సరైన గుర్తింపు వచ్చిందని, సినిమాల్లో కూడా స్టార్‌గా ఎదిగాడని ట్రోల్ చేస్తున్నారు నెటిజన్లు.ఆయన అసలు పేరు ఇదే అంటూ సోషల్ మీడియాలో ఓ పేరును కూడా తెర మీదకు తీసుకువస్తున్నారు. అయితే ఈ ప్రచారంపై ఎన్టీఆర్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఎన్టీఆర్‌పై కావాలనే ఇలా తప్పుడు ప్రచారం చేస్తున్నారని అభిమానులు ఫైర్ అవుతున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఓ స్టార్ హీరోపై ఇలా దారుణమైన ట్రోల్స్ చేయడాన్ని అభిమానులు తప్పు పడుతున్నారు. ఎన్టీఆర్ పలుమార్లు గుడికి వెళ్లిన సందర్భాలను కూడా వారు వెలికి తీసి నెటిజన్లకు కౌంటరిస్తున్నారు.

# థగ్ లైఫ్ ఈవెంట్ వాయిదా క్లారిటీ ఇచ్చిన కమల్ హాసన్


కమల్ హాసన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా థగ్ లైఫ్. డైరెక్టర్ మణిరత్నం తెరకెక్కిస్తోన్న ఈ మూవీపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. చాలా కాలం తర్వాత వీరి కాంబోలో సినిమా వస్తుందని తెలియడంతో ప్రేక్షకులలో మరింత హైప్ క్రియేట్ అయ్యింది.జూన్ 5న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయబోతోన్నారు. ఈ మూవీలో త్రిష హీరోయిన్‌గా నటిస్తోంది. శింబు మరో ముఖ్య పాత్రను పోషిస్తున్నాడు. ఇప్పటికే జింగుచా అనే పాటను విడుదల చేసి మ్యూజికల్ ప్రమోషన్స్‌ను స్టార్ట్ చేశాడు. ఇక థగ్ లైఫ్ ప్రమోషన్స్‌లో కమల్ హాసన్ ముందు నుంచీ ఫుల్ జోష్‌తో పాల్గొంటున్నాడు.కమల్ హాసనిర్మాణంలో థగ్ లైఫ్ రాబోతోంది. ఇక ఈ మూవీ ప్రమోషన్స్ కోసం తెలుగులోని కొన్ని చానెళ్లకు ఇంటర్వ్యూలు కూడా ఇచ్చాడు కమల్ హాసన్. అయితే ప్రస్తుతం దేశంలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల గురించి తెలిసిందే. ఇండియా, పాక్ మధ్య ఎలాంటి భీకర వాతావరణం నెలకొందో చూస్తూనే ఉన్నారు. ఇలాంటి తరుణంలో తన థగ్ లైఫ్ ఆడియో కార్యక్రమం జరపడం సరి కాదని కమల్ హాసన్ భావించాడు.ప్రస్తుతం మన కోసం మన సైనికులు పోరాడుతున్నారని, అలాంటి తరుణంలో మనం ఇక్కడ ఆడియో ఈవెంట్ అని సంబరాలు చేసుకోవడం కరెక్ట్ కాదని అన్నాడు. 16వ తేదీన జరగాల్సిన ఈ ఈవెంట్‌ను పోస్ట్ పోన్ చేస్తున్నాను. ఇక త్వరలోనే కొత్త డేట్‌ను ప్రకటిస్తాం, మళ్లీ పరిస్థితులు చక్కబడిన తరువాత ఈ ఈవెంట్‌ను చేసుకుందాం అని కమల్ హాసన్ ట్వీట్ చేశాడు.ఈ సినిమాలో శింబు, త్రిష, జోజు జార్జ్, ఐశ్వర్య లక్ష్మీ, అశోక్ సెల్వన్, అభిరామి, నాజర్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రాన్ని జూన్ 5న రిలీజ్ చేయనున్నారు. ఈ చిత్రాన్ని కమల్ నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిని ప్రొడక్షన్ హౌజ్ రెడ్ జెయింట్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

# అన్నింటి కంటే దేశం ముఖ్యం: 'అబీర్ గులాల్' నటి

అన్నింటి కంటే దేశం ముఖ్యమని నటి రిద్ధి డోగ్రా అన్నారు. తాను నటించిన 'అబీర్ గులాల్' సినిమా వాయిదాపై అలా స్పందించారు.పాకిస్థాన్ నటుడు ఫవాద్‌ఖాన్ హీరోగా తెరకెక్కిన ఈ సినిమా శుక్రవారం విడుదల కావాల్సిన ఉండగా.. ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా వాయిదా పడింది. ఈ క్రమంలో ఆమె ఓ చిట్‌చాట్‌లో మాట్లాడారు. సినిమాకి సంబంధించి ప్రస్తుతానికి ఏ విశేషాలు చెప్పలేనని అన్నారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఈ సినిమాని భారత ప్రభుత్వం బ్యాన్ చేసిన సంగతి తెలిసిందే. ఆర్తి ఎస్. బగ్దీ తెరకెక్కించిన ఈ సినిమాలో రిద్ధి కీలక పాత్ర పోషించగా వాణీ కపూర్ హీరోయిన్.



# తన మీద జరిగే ట్రోలింగ్ పై స్పందించిన కరణ్ జోహార్



బాలీవుడ్ ప్రముఖ నిర్మాత, దర్శకుడు కరణ్ జోహార్ బ్రాండ్ ఇప్పుడు అంతగా కనిపించడం లేదు. ఒకప్పుడు దర్శక, నిర్మాతగా కరణ్ జోహార్‌కు ఉన్న ఇమేజ్ వేరు. ధర్మ ప్రొడక్షన్స్ అంటే ఒకప్పుడు అందరికీ గౌరవం ఉండేది. గత కొన్నేళ్ల నుంచి కరణ్ జోహార్ మీద, ధర్మ ప్రొడక్షన్స్ మీద నార్త్ ఆడియెన్స్ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇక కరణ్ జోహార్ తీస్తున్న చిత్రాలు ఇప్పుడు అంతా వర్కౌట్ అవ్వడం లేదు. పైగా నెపో కిడ్స్, స్టార్ వారసుల్ని ఇంట్రడ్యూస్ చేసే పనిలోనే కరణ్ జోహార్ ఉంటున్నాడు.అలా స్టార్ హీరోల వారసుల్ని మాత్రమే ఎంకరేజ్ చేస్తుంటాడు,బయటి వాళ్లని రానివ్వడం లేదు అవుట్ సైడర్స్‌కి అవకాశం ఇవ్వడం లేదని కరణ్ జోహార్ మీద ట్రోలింగ్ జరుగుతుంటుంది. ఇక ఈ క్రమంలో కరణ్ జోహార్ తన మీదే జరిగే ట్రోలింగ్ గురించి రియాక్ట్ అవుతుంటాడు. తాజాగా మరోసారి తన మీద వచ్చే విమర్శలకు సమాధానం ఇచ్చాడు. నెపో కిడ్స్‌ను ఎంకరేజ్ చేస్తుంటానని అంతా ట్రోలింగ్ చేస్తుంటారు,కానీ,అదే అవుట్ సైడర్‌తో సినిమా తీసి హిట్టు కొడితే ఎవ్వరూ ప్రశంసించడం లేదు అని వాపోయాడు.లక్ష్యతో కిల్ మూవీ తీశానుపెద్ద సక్సెస్ అయింది.అయినా ఏ ఒక్కరూ ప్రశంసించడం లేదు,అవుట్ సైడర్స్‌తో సినిమా తీసి హిట్టు కొట్టిన కరణ్ అని ఒక్క ఆర్టికల్ కూడా కనిపించదే అని బాధపడ్డాడు కరణ్ జోహార్. కిల్ సినిమా విషయంలోనూ కరణ్ చాలా కష్టాలు పడ్డాడట. అదే కథను స్టార్ హీరో దగ్గరకు తీసుకెళ్తే వందల కోట్ల రెమ్యూనరేషన్ అడిగారట. తన సినిమా బడ్జెట్టే 50 కోట్ల లోపు ఉంటే వందల కోట్లు స్టార్ హీరోకి ఎక్కడి నుంచి ఇస్తాను అని కరణ్ అన్నాడు.ప్రస్తుతం కరణ్ జోహార్%ఉ(ఖుతీఖఅ జీశీష్ముతీ%) సౌత్ సినిమాల మీద ఫోకస్ పెట్టాడు. లైగర్ మూవీతో చేతులు కాల్చుకున్న కరణ్, దేవర మూవీతో కాస్త గట్టెక్కినట్టుగా సమాచారం. ఇక సౌత్ సినిమాల్ని అక్కడ నార్త్‌లో డిస్ట్రిబ్యూట్ చేసి లాభాలు గడించాలని కరణ్ అనుకుంటున్నాడు. క్రేజీ కాంబోలని సెట్ చేసేందుకు కూడా కరణ్ ప్రయత్నిస్తున్నాడు. కానీ కరణ్‌కు సరైన కాంబో మాత్రం సెట్ అవ్వడం లేదనిపిస్తోంది.తన మీద జరిగే ట్రోలింగ్ పై స్పందించిన కరణ్ జోహార్ కరణ్ జోహార్ నెపోటిజంకరణ్ జోహార్ ట్రోలింగ్‌కు కొత్తేమీ కాదు. గతంలో కంగనా రనౌత్‌తో తలెత్తిన వివాదం, స్టార్ కిడ్స్‌కు చెందిన వారినే ఎంచుకుంటారన్న అభియోగాలు తరచూ వినిపిస్తుంటాయి. కానీ 'కిల్' చిత్రంతో ఆయన చేసిన కొత్త ప్రయోగాన్ని చర్చించకుండా, తన గతమే పదే పదే బయటకు తీయడం అన్యాయమని ఆయన అన్నారు.ఈ ట్రోలింగ్ వల్ల తనపై మానసిక ఒత్తిడి బారినపడ్డానని, ఒక వ్యక్తిగా తనను కూడా అర్థం చేసుకోవాలని కోరారు. "ప్రతి ఒక్కరికీ భావోద్వేగాలు ఉంటాయి. సెలబ్రిటీలను కూడా మనుషుల్లా చూడండి.అని కరణ్ విజ్ఞప్తి చేశారు.మొత్తంగా, కరణ్ జోహార్ తాజా వ్యాఖ్యలు బాలీవుడ్‌లో నెపోటిజం అంశాన్ని మరోసారి చర్చకు తెరలేపాయి. 'కిల్' సినిమా తరహాలో అవుట్ సైడర్ నటులకు అవకాశాలు కల్పించాలనే కరణ్ ప్రయత్నం ప్రశంసనీయమే అయినా, అతనిపై ఉన్న ముద్రను అతను పూర్తిగా తుడిచేయలేకపోతున్నట్టే కనిపిస్తోంది.

# ఆ దేశం అద్దెకు తీసుకోవచ్చు.. మీ ఫొటోతో కరెన్సీ: పూరి జగన్నాథ్



పూరి మ్యూజింగ్స్' పేరిట ఆసక్తికర విశేషాలు పంచుకునే దర్శకుడు పూరి జగన్నాథ్ (%ూబతీఱ జీముస్త్రుఱఅఖుఎస్త్ర%). ఇప్పటికే ఎన్నో కొత్త సంగతులు చెప్పిన ఆయన తాజాగా ఓ దేశం గురించి మాట్లాడారుఅదే కంట్రీ? దాని ప్రత్యేకతలేంటి? ఆయన మాటల్లోనే..''ఓ దేశాన్ని అద్దెకు తీసుకోవచ్చనే విషయం మీకు తెలుసా..? చాలామందికి తెలియని ఒక చిన్న దేశం ఉంది. దాని పేరు లిక్టన్‌స్టైన్ 160 చదరపు కి.మీ. విస్తీర్ణం. కారులో 30 నిమిషాల్లో దాన్ని చుట్టేయొచ్చు. ఎన్నో విమానాశ్రయాల కంటే చిన్నది. ఆ దేశం స్విట్జర్లాండ్, ఆస్ట్రియా మధ్య ఉంది. ఆ దేశాన్ని ఓ రాజు పరిపాలిస్తున్నాడు. ఆ రాయల్ ఫ్యామిలీ ఓ కొండపై నివసిస్తోంది. రోమన్ క్యాథలిక్స్ ఉండే దేశమిది. వారు జర్మన్ మాట్లాడతారు. ఈ దేశానికి వాయు మార్గం, జల మార్గం లేవు. జ్యూరిక్ నుంచి రైల్లోగానీ కార్లోగానీ వెళ్లొచ్చు. భద్రత ఎక్కువగా ఉండే దేశాల్లో ఇదొకటి. జనాభా 40 వేలు కూడా ఉండదు. క్రైమ్ రేట్ లేకపోవడం వల్ల అక్కడి వారు తమ ఇంటికి ఎప్పుడూ తాళం వేయరు. వారంతా ఒకరికి ఒకరు పరిచయం. ట్యాక్స్ బెనిఫిట్ కోసం బయట వారు ఎక్కువగా అక్కడ కంపెనీలు నెలకొల్పుతుంటారు"'నేషనల్ హాలీడేస్, పండగల వేళ అక్కడి ప్రజలు సంప్రదాయ దుస్తులు ధరిస్తారు. ఆగస్టు 15.. వారికి నేషనల్ డే. ఒకవేళ కావాలనుకుంటే 70 వేల డాలర్లు చెల్లించి మీరు ఈ దేశాన్ని ఒకరోజు అద్దెకు తీసుకోవచ్చు. మీకు రెడ్ కార్పెట్‌తో వారంతా స్వాగతం పలుకుతారు. రాయల్ ప్యాలెస్‌లో వసతి ఏర్పాటు చేస్తారు. స్ట్రీట్ బోర్డ్స్ మీ పేరిట వెలుస్తాయి. మిమ్మల్ని ఓ రాజులాగా ట్రీట్ చేస్తారు. అంతే కాదు మీ ఫొటోతో ఫేక్ కరెన్సీ క్రియేట్ చేస్తారు. దాంతో, అక్కడ మీరు ఏది కావాలంటే అది కొనుక్కోవచ్చు. టూరిస్టులతో అక్కడివారు ఎంతో ప్రేమగా ఉంటారు" అని వివరించారు.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: tелugurastram2016@gmail.com, Phone No. 8074368339